AKHLAQUI KAHANIYAN-IV
(Telugu)

నీతి కథలు

నాలుగవ భాగం

మూలం:
మౌలానా అఫ్జల్ హుసైన్ M.A., L.T.

అనువాదం:
అబ్బాదుల్లా B.A.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

ముస్లిముల ప్రథమ కర్తవ్యం

ఎందరో చక్రవర్తులు భారతదేశాన్ని పాలించారు. వారిలో ఔరంగజేబు ఒకడు. ఇతడు షాహ్‌జహాన్ కుమారుడు. పూర్తి పేరు మొహియుద్దీన్ ఔరంగజేబు. మొగలు రాజులలో ప్రసిద్ధికెక్కిన చక్రవర్తి; విద్వాంసుడు కూడ. పరిపాలనాదక్షత కలవాడు. నిండు ఏబది సంవత్సరాలు దేశాన్ని పాలించాడు. అక్బరు చక్రవర్తి కాలంలో ఎన్నో నూతన సిద్ధాంతాలు సమాజంలో చోటుచేసుకున్నాయి. నాస్తికత్వం, మతరాహిత్యం ప్రజలలో వ్యాపించాయి. ఇలాంటి తత్వాలు మనిషిని దైవం నుండి దూరం చేస్తాయి. అవి చాలావరకు ఔరంగజేబు కాలంలో అంతమయ్యాయి. ఔరంగజేబు ఎన్నో సంస్కరణల్ని సమాజంలో ప్రవేశపెట్టాడు. రేయనక పగలనక కష్టపడి ప్రజాపాలన చేశాడు. అతి సాధారణ జీవితం గడిపేవాడు. దైవ ధర్మాన్ని జీవితమంతా పాటించాడు. తిండికి, బట్టకు ప్రభుత్వ ధనాగారం నుండి చిల్లిగవ్వ కూడ తీసుకొనేవాడు కాదు. టోపీలు అల్లేవాడు, దివ్య ఖుర్‌ఆన్ ప్రతులను వ్రాసేవాడు; వచ్చిన కాస్తో కూస్తో సంపాదన సొంత ఖర్చులకు వినియోగించుకొనేవాడు. దైవ భయంతో జీవితం గడిపాడు. అనుదినం ఐదు పూటలు వేళకు సరిగ్గా నమాజ్ చేసే మహనీయులలో ఔరంగజేబు ఒకడు.

ఔరంగజేబు జీవితంలో జరిగిన ఒక సంఘటన. ఆయన నిండు యవ్వనంలో ఉన్న సమయం. తండ్రి షాజహాన్, ఔరంగజేబును సైన్యాధిపతిగ నియమించి, కాబూల్‌పై దండెత్తడానికి పంపాడు. బలసంపన్నుడు, సాహసోపేతుడు అయిన ఔరంగజేబు సైన్యాన్ని రణరంగంలోకి తెచ్చాడు. యుక్తంగా స్థావరాలను ఏర్పరచాడు. యుద్ధం ప్రారంభించాడు. హోరాహోరీ పోరాటం సాగుతోంది. ఇంతలో నమాజ్ వేళ అయింది. దైవ దాసులు, దైవ సహాయం అర్థించుకునే సమయం

వచ్చింది. దైవాజ్ఞను ఉల్లంఘించక జీవితం గడిపే ఔరంగజేబు విషయం చెప్పాలా?! గజారూఢుడై ఉన్న ఔరంగజేబు వెంటనే క్రిందికి దిగాడు. యుద్ధమైదానంలోనే "అల్లాహు అక్బర్" అని చేతులు కట్టి నమాజ్‌కు నిలుచున్నాడు. జయాపజయాల్ని ఖాతరు చేయలేదు. యుద్ధమైదానంలో దైవారాధనలో ఉంటే ప్రాణానికి ముప్పు కలుగుతుందేమో అన్న భయం కూడ ఆయనకు కలుగలేదు. నిర్మల మనస్సుతో నిర్భయంగా నిలిచి ఔరంగజేబు నమాజ్ చేయడం చూచింది శత్రు సైన్యం. ఆయన ధైర్యాన్ని, దైవ ప్రీతిని చూచి దిగ్భ్రాంతి చెందింది. ఎన్నో ఆలోచనలు శత్రువులను కలవరపరచాయి. ఔరంగజేబు ధైర్యస్థైర్యాలు, దైవ ప్రీతి, ధర్మనిష్టను చూచిన శత్రువులకు ఆయనతో యుద్ధం చేసే సాహసం లేకపోయింది. వారు పరాజయాన్ని ప్రకటించుకొంటూ ఔరంగజేబుకు లొంగిపోయారు. కాబూల్ మొగలాయిల వశమయింది.

విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చేవారికి విజయం చేకూరకపోతుందా!

న్యాయం

ఇస్లామ్ ధర్మానుసారం జీవితం గడిపిన మహనీయులలో "ఖులఫాయె రాషిదీన్" అదర్శప్రాయులు. అందులో హజ్రత్ అలి (రజి) ప్రజల ప్రేమాదరణలను చూరగొన్న వ్యక్తి. అమిత గౌరవం కలవారు. చిన్న ప్రాయంలోనే ఇస్లామ్ స్వీకరించారు. ధర్మనిష్ఠతో జీవితమంతా గడిపారు. ఆయన జీవితంలోని ఒక సంఘటన.

ఒకప్పుడు హజ్రత్ అలి (రజి) ఒక యుద్ధంలో పాల్గొనేందుకు వెళుతున్నారు. యుద్ధ సామగ్రిలో ఆ రోజుల్లో అతి ముఖ్యంగా కవచం ఉండేది. మార్గంలో ఆయన కవచం కనబడలేదు. ఎక్కడ పోయిందో ఎవరికీ తెలియదు. యుద్ధం ముగిసింది. విజయానంతరం అందరు తిరిగివచ్చారు; 'కూఫా' పట్టణం చేరుకున్నారు.

కోల్పోయిన యుద్ధ కవచం ఆ పట్టణంలోని ఒక యూదుని వద్ద

చూచారు. హజ్రత్ అలి (రజి) కవచాన్ని గుర్తుపట్టి, అది తనదేనని, తనకు వాపసు ఇవ్వమని ఆ యూదుణ్ణి కోరారు. యూదుడు కవచం ఇవ్వడానికి నిరాకరించాడు. ధర్మానుసారం విషయం న్యాయస్థానానికి వెళ్ళింది. న్యాయం చెయ్యవలసిందిగా న్యాయాధిపతిని కోరారు. విచారణ ప్రారంభమైంది. వాది, ప్రతివాదులు న్యాయస్థానానికి వచ్చారు. హజ్రత్ అలి (రజి) ఒక ఖలీఫా, రాజ్యాధినేత. కాని న్యాయస్థానంలో ఆయన ఒక సామాన్య పౌరుడు మాత్రమే! వెంటనే హజ్రత్ అలి (రజి) తన కవచం విషయం ఫిర్యాదు చేశారు. న్యాయాధిపతి, ధర్మానుసారం సాక్షులను హాజరుపరచమని హజ్రత్ అలిని కోరారు. ఆయన ఇద్దరు సాక్షులను హాజరుపరచారు. అందులో ఒకరు 'ఖబస్' అనే వ్యక్తి. ఈయన హజ్రత్ అలి (రజి) నౌకరు. రెండవ సాక్షి హజ్రత్ హుసైన్ (రజి), ఈయన హజ్రత్ అలి కుమారుడు.

న్యాయాధిపతి ఇస్లామ్ చట్టరీత్యా తీర్పు చేశారు. హాజరుపరచిన ఇద్దరి సాక్ష్యం హజ్రత్ అలి (రజి) ఫిర్యాదు చేసిన కేసులో చెల్లదని తీర్పు చేశాడు. ఎందుకు? హజ్రత్ అలి (రజి) తన కుమారుణ్ణి, తన నౌకరును పోషిస్తున్నారు. పోషింపబడే వ్యక్తి తన యజమాని పట్ల సాక్ష్యం పలికినా అది చట్టరీత్యా చెల్లదు. ఇంకేముంది హజ్రత్ అలి (రజి) మౌనం వహించాల్సి వచ్చింది. యుద్ధ కవచం యూదుని చేతుల్లో ఉండిపోయింది.

న్యాయస్థానంలో యుద్ధ కవచం విషయంలో న్యాయం కోరుతూ ఫిర్యాదు చేసింది ఖలీఫా. న్యాయమూర్తి ధర్మచట్టంలో ఎలాంటి రాయితీ చూపకుండ న్యాయశాస్త్రం ప్రకారం తీర్పు చేశారు. ఆ తీర్పును హజ్రత్ అలి (రజి) అంగీకరించారు. ఈ విషయాలన్నీ యూదుణ్ణి ఆకర్షించాయి. ఇస్లామియ న్యాయశాస్త్రంలో ఉన్న గొప్పతనం, నిష్పాక్షికత గ్రహించిన యూదుడు ఎంతో ప్రభావితుడయ్యాడు. యుద్ధ కవచాన్ని తెచ్చి హజ్రత్ అలి (రజి)కు అప్పగించాడు. ఇస్లామ్ ధర్మ విశిష్టతను కొనియాడుతూ ముస్లీమ్ అయ్యాడు.

న్యాయం సమాజానికి జీవం. న్యాయం వర్ధిల్లిననాడే సత్సమాజం స్థాపించబడుతుంది. మానవుడికి శాంతి లభిస్తుంది.

సమానత్వం

ప్రపంచంలో ఎందరో విశ్వాసులు పుట్టారు. ధర్మానుసారంగా జీవించారు. ధర్మ సంస్థాపనానికి కృషి చేశారు. చరిత్ర పుటలు ఇలాంటి పుణ్య పురుషుల జీవితాలతో నిండి ఉన్నాయి.

సుల్తాన్ మురాద్ ప్రజలనేలిన ఒక పాదుషా. ఇతడు దైవ భయం కలిగి, ఇహపరాలలో సార్థకమయ్యే జీవితాన్ని గడపాలనుకున్నాడు. దైవాన్ని అమితంగా స్తుతించేవాడు. దైవారాధన కోసం ఒక మస్జిదు నిర్మించదలచాడు. సుల్తాన్ తలచు కుంటే జాప్యం జరుగుతుందా! ఆజ్ఞ ఇవ్వడమే తడవుగా అత్యాధునిక పద్ధతుల్లో అందచందాలు వెదజల్లే సువిశాల భవనమొకటి నిర్మించాడు. ఆ కట్టడపు తీరు అందులోని అందం ప్రజలనందర్నీ ఆకర్షించింది. కాని అందరి చూపులు సమానంగా ఉంటాయా? ప్రజలకు నచ్చిన ఆ చక్కటి మస్జిదు సుల్తాన్‌కు ఏ కారణం వల్లనో నచ్చలేదు. ఎంతటి సాధువైనా సార్వభౌమాధికారాన్ని పొందిన పిమ్మట తప్పటడుగు వేసే ప్రమాదముంది. వెంటనే ఆ సుల్తాన్ మస్జిదు నిర్మించిన నిపుణుణ్ణి పిలిపించాడు. అతనిపై కోపాగ్ని కురిపించాడు. అంతటితో ఊరుకోక అతని రెండు చేతుల్ని నరికివేశాడు. పాపం కష్టజీవి, రేయింబవళ్ళు కష్టపడి పనిచేసి కూడ రెండు చేతుల్ని కోల్పోయాడు. అతని జీవితమే ఇక నిరర్థకమయింది.

ఆ కాలంలో దైవ ధర్మం ప్రకారం తీర్పుచేసే న్యాయస్థానాలు ఉండేవి. వెంటనే ఆ బాధితుడు రక్తసిక్త హస్తాలతో న్యాయస్థానం చేరాడు. న్యాయాధిపతికి తనకు జరిగిన అన్యాయాన్ని గూర్చి చెప్పుకున్నాడు. సుల్తాన్ నిష్కారణంగా తనను శిక్షించాడని ఈ విషయంలో న్యాయం చేకూర్చమని ఫిర్యాదు చేసుకున్నాడు. వెంటనే సుల్తాన్‌ను న్యాయస్థానానికి రప్పించాడు. న్యాయవిచారణ చేశాడు. సుల్తాన్ అపరాధిగా ఒక వైపు, న్యాయ నిర్ణయం కొరకు నిరీక్షణ చేస్తూ కష్టజీవి మరో వైపు నిలుచుంటే న్యాయస్థానం అంతా ప్రేక్షకులతో కిటకిటలాడింది. చేసిన ఘోర నేరానికి సుల్తాన్ సిగ్గుపడుతూ తప్పు ఒప్పుకున్నాడు. అందుకు తన

విచారాన్ని ప్రకటించాడు. నేరం రుజువయింది. చట్టప్రకారం తీర్పు జరగాల్సిందే. [illegible] రక్తం కాయకష్టంతో శ్రమించే కష్టజీవి రక్తం కన్నా ఎరుపు కాదు కదా! సుల్తాన్ చేతులు కూడా నరకబడాలని తీర్పు అయింది. దైవ ప్రీతి పొందాలనుకున్నవారు దైవ శాసనోల్లంఘనకు ఒడిగట్టరు. వెంటనే సుల్తాన్ ఒక దోషిగా ముందుకు వచ్చాడు. తన చేతుల్ని నరకమని అభ్యర్థించుకొన్నాడు. ఈ దృశ్యాన్ని చూస్తూనే ఆ కష్టజీవి మనసు కరిగిపోయింది. సర్వ మానవులు సమానం అన్న ధర్మశాస్త్ర సూత్రాన్ని న్యాయాధిపతి అవలంబించిన వైఖరి, ఆ కష్టజీవిని ప్రభావితం చేసింది. వెంటనే అతడు ఇలా అన్నాడు.

"రాజ్యమేలుతున్న సుల్తాన్, నాలాంటి ఒక సామాన్య వ్యక్తి న్యాయస్థానంలో సమానులే. మా ఇరువురిలో ఏ మాత్రం వ్యత్యాసం చూపక నిష్పాక్షికంగా తీర్పు ఇచ్చింది ధర్మశాస్త్రం. ఈ సమానత్వపు విలువలు, మహాప్రవక్త (స) మనకందించిన బహుమానాలు. ఓ సుల్తాన్! మహాప్రవక్త (స) ప్రబోధించిన ప్రకారమే నేను నీకు క్షమాభిక్ష ప్రసాదిస్తున్నాను, ఇక నీవు వెళ్ళవచ్చు" అన్నాడు ఆ మస్జిదు నిర్మించిన కష్టజీవి.

దైవధర్మమున్న చోట మానవత్వం వికసిస్తుంది.

వాగ్దానం

నిత్య జీవితంలో ఎన్నో సంఘటనల్ని, సమస్యల్ని ఎదుర్కోవలసి వస్తుంది. వాటికి సరయిన పరిష్కారం కూడా కనుగొనవలసి వస్తుంది. జాలి గుండెలు కల మనిషి చేజిక్కిన శత్రువుల్ని కూడా ఒకప్పుడు వదలివేయవలసివస్తుంది, క్షమాభిక్ష పెట్టమని అర్థించినప్పుడు మానవత్వంగల ప్రతి వ్యక్తి కరుణతో క్షమించానని పలుకుతాడు. శత్రువు కుటిలుడయినా, కఠినుడయినా విశ్వాసి మాత్రం తన మాటపై నిలబడతాడు. వాగ్దానాన్ని పాలించిన ఆదర్శవంతులెందరో చరిత్రలో మనకు అగుపిస్తారు. రండి, ఒక సంఘటన విందాం:

హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫాగా, ప్రాతినిధ్య పరిపాలకునిగా, ప్రజాప్రతినిధిగా విశ్వాసులందరికీ నాయకుడై ఎంతో శాంతియుతంగా దైవధర్మానుసారం రాజ్యపాలన చేస్తున్నారు. రాజకీయాలలో రణరంగాలు తప్పవుగా! ముఖ్యంగా ప్రజారంజకంగా పరిపాలన సాగుతుంటే పొరుగుదేశ పరిపాలకులకది కంటిలోని నలుసు కాకుండా మరేమవుతుంది? ముస్లిముల సామ్రాజ్యం దాని సుస్థిరత చూచి అప్పటి ఈరానీయులకు కడుపు మంట కలిగింది. వెంటనే ఉమర్ (రజి) సామ్రాజ్యంపై మెరుపులా విరుచుకుపడ్డారు. ఆ యుద్ధంలో అబూ ఉబైదా ముస్లిములకు సేనాధిపతి అయ్యారు. జాబాన్ అనే వ్యక్తి ఈరానీయుల తరఫున సైన్యాధిపతిగా నియమించబడ్డాడు. 'నమారిఖ్' అనే ప్రదేశంలో హోరాహోరీగా పోరాటం సాగింది. యుద్ధం తీవ్రంగా కొనసాగుతూ ఉంది. ఈరానీయులు తమ ప్రాణాల్ని ఖాతరు చేయకుండా జయాపజయాలు తేల్చుకోవడానికి వీరోచితంగా పోరాడుతున్నారు. కాని ముస్లిమ్ యోధులు వారి ఎత్తులకు పైఎత్తులు వేస్తూ శత్రువుల్ని చిత్తుచేస్తూ ముందుకు సాగుతున్నారు. చివరకు ఈరానీయులు పరాజితులయ్యారు. పాపం ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ఇక మిగిలిన ఈరానీయులు పలాయనం చిత్తగిస్తున్నారు.

యుద్ధాలలో శత్రు సైన్యాల్ని వధించుటకంటే వారిని పట్టుకుని చెరవేయడం ఘన విజయంగా భావించబడుతుంది. ముస్లిమ్ వీరకిశోరులు పరాజయులయిన ఈరానీయులను పట్టుకోవడం ప్రారంభించారు. అందులో ఒకడు ఈరానీ సేనాధిపతి అయిన జాబాన్‌ను పట్టుకుని బంధించాడు. జాబాన్ మహా మోసగాడు. వంకలు పెట్టి వదిలించుకోవడానికి ప్రయత్నిస్తూ ఇలా అన్నాడు: "అయ్యా! నేను ఒక వృద్ధుణ్ణి. నన్ను బంధిస్తే నీకేమొస్తుంది? వదలిపెట్టావా, నీకు నచ్చినంత బంగారం సమర్పించుకుంటాను."

ముస్లిమ్ సైనికుడు అతగాణ్ణి గుర్తుపట్టలేదు. అతడే జాబాన్ అని కలలో కూడా తలంచలేదు, అందుచేత ఆ అమాయక సైనికుడు మోసపోయాడు. "నీకు **క్షమాభిక్ష పెట్టాను పో"** అని అభయమిచ్చాడు. జాబాన్ వృద్ధ సేనాధిపతి **అని,**

అతడు పచ్చి మోసగాడని, వంచించి ఎంతటి సంక్షోభాన్నయినా సృష్టిస్తాడని ఎవరికీ తెలియదు!

జాబాన్ ముస్లిం సైనికుని చేతిలో క్షమాభిక్ష పొంది దాన్ని ఖాయపరచుకున్నాడు. ఇక ఇద్దరూ అబూ ఉబైదా గుడారానికి చేరారు. సైన్యాధిపతి గుడారం కదా! అధికారులెందరో అక్కడున్నారు. వారు ఒక్క చూపులోనే జాబాన్‌ను గుర్తుపట్టేశారు. ఇంకేముంది ముస్లిమ్ సైనికుడు శత్రు సేనాధిపతికిచ్చిన అభయ వాగ్దానం విని చేతులు నులుముకుంటూ నిలిచిపోయాడు. కొంత మంది అధికారులు అబూ ఉబైదాను చూస్తూ, "జాబాన్ మహా టక్కరి. మోసగించి ప్రాణం దక్కించుకున్నాడు. అందుచేత ఇచ్చిన వాగ్దానం రద్దయిపోతుంది. అతన్ని వదలడం కంటే వధించడం ఉత్తమం" అన్నారు.

ముస్లిమ్ సేనాధిపతి దైవధర్మం పట్ల విశ్వాసం గల మనిషి. వాగ్దానానికున్న ప్రాముఖ్యత ఆయనకు బాగా తెలుసు. ఇచ్చిన వాగ్దానం నెరవేర్చనివాడు విశ్వాసవంతుడు కాడు. నరకానికి చేరుతాడు. అందుచేత ఆయన ఇలా అన్నారు: "ఇప్పుడలా జరగదు, మన సమాజంలోని ఒక వ్యక్తి కూడా ఇతర వ్యక్తికి క్షమాభిక్ష పెట్టాడంటే మన సమాజమంతా ఆ వాగ్దాన నిర్వహణ కోసం అంకితం కావాలి. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. వాగ్దానం నెరవేర్చి దైవ సమక్షంలో గౌరవోన్నతులందుకోవాలి. ఇప్పుడు జాబాన్ రక్తం మనకు నిషిద్ధం. వాగ్దానానికి వ్యతిరేకంగా ప్రవర్తించడానికి ఇస్లామ్‌లో ఇసుమంతయినా వీల్లేదు."

మభ్యపెట్టేవాని మాట చెల్లదు

ప్రపంచంలో పండితులెందరో వచ్చారు. సాధారణ మానవులకు తెలియని విద్యలు నేర్పారు. సత్యాన్ని తెలుసుకోవడానికి సకల ప్రయత్నాలు చేశారు. మంచి మాటలనే మానవులకందించారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) సత్ ప్రవచనాల్ని

సంగ్రహించడంలో కూడా ముహద్దీసులనబడే విద్యావేత్తలెందరో రేయింబవళ్ళు కృషి చేసి ప్రవక్త హదీసులను సంగ్రహించి ఆయన (స) చెప్పిన మాట చెప్పినట్లే తమ గ్రంథాల ద్వారా మన వరకు చేర్చారు.

ఇమామ్ బుఖారీ (రహ్మలై)ను ఎరుగనివారు ప్రపంచంలో లేరు. హదీసు సంగ్రహణలో ఆయనకు అద్వితీయమయిన ప్రజ్ఞాపాటవాలున్నాయి. ఈనాటికీ ఇమామ్ బుఖారీ సంకలనం చేసిన హదీసులంటే వాటిని తిరస్కరించేవారు ఎవరూ లేరు. ఇలాంటి హదీసుల సంకలనంలో ఆయన చేసిన కృషి, ప్రాణాన్ని సయితం తెగించి దూర దూర ప్రాంతాలకు ప్రయాణం చేసి నిజమైన హదీసుల క్రోడీకరణ కోసం చేసిన ప్రయత్నం, పాటించిన జాగ్రత్త మనం తెలుసుకొన్నట్లయితే ఆ పండితోత్తముడు ప్రజలకు చేసిన మహత్తర ఉపకారమేమిటో అర్థమవుతుంది. ఎందుచేతనంటే దైవం ప్రసాదించిన దివ్య ఖుర్‌అన్ ఏ విధంగా పొల్లుపోకుండా భద్రంగా మన దగ్గర ఉందో, అదే విధంగా ఆ దివ్య గ్రంథం తరువాత అగ్రస్థానం వహించిన గ్రంథం, ఇమామ్ బుఖారీ సంకలనం చేసిన "బుఖారీ షరీఫ్."

ఇమామ్ బుఖారీ హదీసుల సంగ్రహణలో పరిశోధనాత్మకమయిన మార్గాన్ని పాటించారు. వాటి సత్యాసత్యాలను కనుగొనేందుకు ఎన్నో సూక్ష్మ పరీక్షల్ని చేసేవారు. అవి అన్ని పరీక్షలను నెగ్గుకువచ్చి సత్యమయిన హదీసులని రూఢి అయినంత వరకు ఇమామ్ బుఖారీ సుదీర్ఘమయిన కృషి చేసేవారు. అనేక పర్యాయాలు హదీసుల సేకరణ కోసం దూర దూర ప్రాంతాలకు ప్రయాణాలు కూడా చేసేవారు. ఏదయినా ఒక విషయంలో ఫలానా ప్రాంతంలోని వ్యక్తికి ఆధారభూతమయిన అనుభవం, విజ్ఞానం ఉందంటే చాలు అక్కడి వరకూ వెళ్ళి ఆ విషయంలో పరిశోధన చేసి అందిన సహాయాన్ని పొందేవారు. ఒక సంఘటన వినండి:

ఓసారి తాను సంగ్రహించిన మహాప్రవక్త (స) ప్రవచనం విషయంలో అదనపు పరిశీలన కోసం ఒక ముహద్దిస్ (హదీసుల విద్యనభ్యసించినవారి) వరకు వెళ్ళే అవసరం కలిగింది. ఇమామ్ బుఖారీ ప్రయాణం చేస్తూ ఆ ముహద్దిస్ ఇంటి హద్దు వరకు వెళ్ళారు. అక్కడొక దృశ్యం ఆయన కంటబడింది. ముహద్దిస్‌కు ఒక

గుర్రం ఉంది. అది తన కళ్ళాన్ని త్రెంచుకుని పరుగుతీస్తోంది. ముహద్దిస్ దాన్ని పట్టుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. వట్టి పిడికిలి చూపిస్తూ గుర్రాన్ని మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. "దా! దా! ఇదిగో తీసుకో"మ్మని గుర్రానికి ఆశ చూపిస్తున్నాడు. నోరులేని పశువు కదా! మనిషిని నమ్మింది, దగ్గరకు చేరింది. ఇలా ఆ యజమాని గుర్రాన్ని మోసగించి పట్టుకున్నాడు.

ఇమామ్ బుఖారీ నీతినియమాలుగల వ్యక్తి. నిష్కళంక హృదయం కలవారు. ఉన్నది ఉన్నట్లే పలికే సత్యధర్మపరాయణుడు. సదాచార సంపన్నుడు. మోసగించి స్వార్థాన్ని ఆపేక్షించేవారు కారు. హదీసుల పరిశీలన కోసం వచ్చిన ఇమామ్ బుఖారీ ఇదంతా కళ్ళారా చూచి ఇంకేమీ ఆలోచించకుండా అక్కణ్ణుంచి తిరుగు ప్రయాణం చేశారు. గుర్రాన్ని మోసగించి స్వార్థాన్ని ఆపేక్షించిన వ్యక్తి మాటల్ని ఎలా నమ్మగలం అని నిర్ణయించుకున్నారు.

చూశారా! ఇమామ్ బుఖారీ హదీసు సంకలనం విషయంలో ఎంత జాగ్రత్త వహించారో! అతగాడు గుర్రాన్ని పట్టుకోవడానికి ప్రయోగించిన ఉపాయం ఇమామ్ బుఖారీ దృష్టిలో కాపట్యం తప్ప మరేం కాదు. అలాంటివారు చేసే ఉల్లేఖనం కూడా నమ్మడానికి సాధ్యం కాదు. ఇంతటి జాగ్రత్త వహించడం వల్ల, హదీసు సంకలనంలో రేయింబవళ్ళు పరిశీలనాత్మక దృష్టితో పనిచేయడం వల్ల ఆయన సంగ్రహణ గ్రంథం దివ్య ఖుర్ఆన్ తరువాతి స్థానం అందుకోగలిగింది. విద్యా విజ్ఞానాలతోపాటు సత్యపరిశోధన, కృషి సతతం ఫలదాయకమవుతాయి.

అవసరానికి ఆసరా

హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లామ్ వెలుగుబాటపై రాజ్యమేలిన నలుగురు ఆదర్శ ఖలీఫాలలో ఒకరు. ప్రజాపాలనలో ఈయన సాటిలేని ఖ్యాతి పొందారు. ప్రజల సుఖ దుఃఖాలను తెలుసుకోవడానికి, ప్రజలకు సౌకర్యాలు సమకూర్చేందుకు,

రాత్రి సమయాల్లో పట్టణ వీధుల్లో గస్తీ తిరిగేవారు. ప్రజాసేవకే తన జీవితం అంకితం చేయడం వల్ల రేయింబవళ్ళు నిర్విరామంగా కష్టపడి పనిచేసేవారు.

ఒక దినం జరిగిన వృత్తాంతం వినండి. హజ్రత్ ఉమర్ (రజి) యథాప్రకారం రాత్రి సమయాన గస్తీ తిరుగుతూ మదీనా పట్టణ పొలిమేర దాటివెళ్ళారు. వెంట "అస్లమ్" అనే బంట్రోతు కూడా ఉన్నారు. ఊరి బయట ఒక గుడారం కనబడింది. వెంటనే హజ్రత్ ఉమర్ (రజి) అటు వెళ్ళారు. గుడారాన్ని సమీపించారు. పాపం ఒక పల్లెటూరి మనిషి, విచార వదనంతో గుడారం ఆవలి వైపు కూర్చుని ఏదో యోచిస్తున్నాడు. గుడారంలో ఏదో మూలుగు వినబడుతూంది. హజ్రత్ ఉమర్ (రజి) అక్కడున్న వ్యక్తిని కలుసుకొని కారణం అడిగారు, ఆ వ్యక్తి తన గాథను వినిపించుకున్నాడు. "అయ్యా! నా భార్య ప్రసవ వేదనతో బాధపడుతోంది. ఆమెకు తోడుగా ఉండి కాన్పు చేయించే వారెవ్వరూ లేరు. మేమా ప్రయాణీకులం. ఉన్న కాస్త డబ్బు ఖర్చయిపోయింది. ఏమీ తోచక తికమక పడుతున్నాను." అతని పరిస్థితి విన్న ఖలీఫాకు జాలివేసింది. ఖలీఫా ఆలసించక వేగంగా ఇంటికి చేరారు. తన సతీమణిని పిలిచి, "పుణ్యం సంపాదించుకునేందుకు ఒక మంచి తరుణం అల్లాహ్ మనకు ప్రసాదించాడు. ఇట్టి అవకాశాన్ని ఉపయోగించుకోకపోతే లాభ మేమిటి? సిద్ధంగా ఉన్నావా?" అంటూ తాను చూచి వచ్చిన సమాచారాన్ని వినిపించారు ఖలీఫా. పతికి తగ్గ సతి కాబట్టి ఎంతో సంతోషపడ్డారు. ప్రజా సేవ చేయడానికి చేజిక్కిన తరుణం దైవ ప్రసాదితం అని తలంచారు. త్వరగా ఆ పుణ్య దంపతులిరువురూ తయారయ్యారు. వంటకు కావలసిన పిండి, నూనె వగైరాలు మూటకట్టుకొని ఖలీఫా నడువసాగారు. ఆయన సతీమణి ప్రసూతి సమయంలో కావలసిన వస్తువులు తీసుకొని ఆయన వెంట నడిచారు. ఇరువురు పల్లెటూరివారి గుడారం చేరారు. ఖలీఫా సతీమణి గుడారం లోనికి వెళ్ళారు. బాధపడుతున్న మహిళను ఓదార్చారు. గుడారపు వెలుపల ఆవేదనలో ఉన్న ఆ మనిషిని పరామర్శిస్తున్నారు ఖలీఫా.

కొద్దిసేపట్లో దైవానుగ్రహం కలిగింది. ఆపదలందున్న ఆ దంపతులకు ఒక మగ శిశువు కలిగాడు. ప్రజాసేవ చేయడంలో మహిళలకందరికీ ఆదర్శం చూపిన ఖలీఫా అర్ధాంగి వెంటనే గుడారంలో నుండి "ఓ అమీరుల్ మోమినీన్! మీ మిత్రునికి ఒక మగ శిశువు కలిగాడని శుభవార్త వినిపించండి" అని అన్నారు. ఆ మాటల్ని విన్న పల్లెటూరి వ్యక్తి తనకు సహాయం చేస్తున్నది ఎవరో కాదు, రాజ్యమేలుతున్న ప్రజాధినేత అని గ్రహించాడు. గాభరాపడ్డాడు. క్షమించమని ప్రాధేయపడసాగాడు. ఖలీఫా అతనికి అభయమిచ్చారు. ఎంతో ప్రేమాదరణతో అతన్ని పలకరించి, "నాయనా! ప్రజాసేవయే నాయకుని ప్రథమ కర్తవ్యం" అని నచ్చ చెప్పారు. వెంట తెచ్చిన పిండి, నూనె, ఇతర పదార్థాలు పల్లెటూరివానికిచ్చి, తిరిగి వెళ్ళారు ఆ పుణ్యదంపతులు ఇరువురూ.

సాహసం

సృష్టిలోకెల్లా ఉత్తముడు మానవుడు. మానవుల్లో కూడా ఒక్కొక్కరిలో ఒక్కో విశిష్టత ఉంటుంది. కొందరు సాహసవీరులవుతారు. మరికొందరు అసమాన ప్రజాపరిపాలకులు అవుతారు. ఇంకా కొందరు వీరోచిత కార్యక్రమాలు నెరవేరుస్తూ సమాజంలో విప్లవాత్మకమయిన మార్పులు తీసుకువస్తారు. దాని వల్ల ప్రజలలో చైతన్యం కలుగుతుంది; అపోహలు, అనుమానాలు ఏవయినా సమాజంలో చోటు చేసుకుంటే అవి అంతమవుతాయి కూడా. అలాంటి కార్యసాధకులు ప్రపంచంలో ఎందరో ఉద్భవించారు. మహనీయులయినప్పటికీ సామాన్యుల వలె జీవితం గడిపారు. దైవారాధన చేస్తూ నిరాడంబరంగా జీవించారు. దైవభయం, దైవప్రీతి వల్ల వారి కార్యకలాపాలన్నిటిలో ఘన విజయం చేకూరుతూ వచ్చింది. ఆపత్కాలంలో కూడా దైవమే వారికి అండగా నిలబడ్డాడు. ప్రాణ రక్షణ కల్గిస్తూ వచ్చాడు కూడా.

మొగలాయి చక్రవర్తుల్లో ఔరంగజేబు ఒక ప్రముఖ స్థానాన్ని పొందాడు,

దైవారాధనలో ఆయనకు ఆయనే సాటి. ధర్మానుసారం వేళకు తప్పకుండా నమాజు చేసేవాడు. పరిస్థితులు ఎలావున్నా ఖాతరు చేసేవాడు కాదు. ప్రాణానికి ముప్పు కలిగించే పరిస్థితులు రానివ్వండి, మనస్సు వశపరుచుకునే ప్రకృతి సౌందర్యాల ప్రదేశంలో ఉండనివ్వండి, నమాజు వేళను మరిచేవాడు కాడు ఆ చక్రవర్తి.

అయన జీవితంలో ఒక సంఘటన వినండి. ఉదయభానుడు పీతాంబర రేఖలు విరజిమ్ముతున్నాడు. ప్రకృతి సౌందర్యం ముగ్ధమనోహరంగా ఉంది. చక్రవర్తి వ్యాహ్యాళికై వెడదామని ఒక అడవి వైపునకు బయల్దేరాడు. అక్కడున్న దృశ్యం ప్రతి ఒక్కరినీ మైమరపించేలా ఉంది. ఎటు చూచినా దైవ సృష్టి స్వతసిద్ధ సౌందర్యంతో వికసిస్తూ ఉంది. మందమారుతం వీస్తుంటే ప్రతి చెట్టు శిఖరాగ్రం నాట్యం చేస్తూ ఉంది. పచ్చని లతలు అలుముకున్న లోయల నుండి అప్పుడప్పుడే వికసించిన పుష్పగుచ్ఛాలు సువాసన వెదజల్లుతున్నాయి. రంగురంగుల దృశ్యాలు మనోరంజకంగా ఉన్నాయి. ఇక పక్షుల ఆనందం వేరుగా చెప్పనవసరం లేదు. ప్రతి చెట్టుపై మృదుమధురమయిన స్వరాలతో దైవారాధన చేస్తున్నాయా అన్నట్లున్నాయి వాటి కంఠస్వరాలు. ఆలంగీర్ ఔరంగజేబు ఈ దృశ్యాన్నంతటినీ తిలకిస్తూ ప్రభావితుడయ్యాడు. అటూ ఇటూ చూస్తూ అన్నీ దైవ స్తుతిలో నిమగ్నమయివుంటే నేనెందుకిలా ఉండాలి అని వెంటనే దైవానికి కృతజ్ఞత తెలుపుకోవడానికి ప్రార్థనలో నిమగ్నుడయ్యాడు.

ఇంకా నమాజ్ చేస్తూనే ఉన్నాడు. అక్కడ ఉన్నట్లుండి ఒక పులి పొదరింటి నుండి బయటకు వచ్చింది. దైవారాధనలో నిశ్చితంగా నిమగ్నుడై ఉన్న చక్రవర్తి వెనకాల వచ్చి, తన పంజాతో వీపు తట్టింది. చక్రవర్తి చీకాకుపడకుండా, భయంతో తడబడకుండా ఒర నుండి ఖడ్గాన్ని లాగి ఎంతో సాహసంతో శక్తి కొద్ది ఆ మృగంపై ఒక్క వ్రేటు వేశాడు. ఇంకేముంది క్రూర మృగం ఆ దెబ్బతో కుప్పకూలిపడింది. చక్రవర్తి నిర్మల మనస్సుతో తన కోటకు చేరుకున్నాడు.

పట్టుదల

ధైర్యసాహసాలు వీరుల సహజ లక్షణాలు. కాని ఒక్కొక్కప్పుడు పరాక్రమశాలురు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతారు. అలాంటి సమయాలలో వారిని కార్యోన్ముఖులు చేయడానికి దైవం చిన్న చిన్న సంఘటనల ద్వారా గుణపాఠం నేర్పుతాడు. సడలిన ఆశలను మళ్ళీ పునరుజ్జీవింపజేస్తాడు. వారిని కార్యదక్షులుగా చేయడమే కాకుండా విజయోన్ముఖులుగా చేస్తాడు కూడా. లక్ష్యసాధనకు తగిన పట్టుదల వారిలో సృష్టిస్తాడు. ఇలాంటి కొన్ని సంఘటనలు చరిత్ర పుటల్లో గోచరిస్తాయి. ఈనాటికీ ఆ దృష్టాంతాలు సాహసవంతులకు స్ఫూర్తినివ్వడమే కాక ఆశించిన పరిణామాలను ఫలింపజేస్తాయి.

పూర్వం స్కాట్లాండ్ దేశంలో రాబర్ట్ బ్రూస్ అనే చక్రవర్తి ఉండేవాడు. ధైర్యసంపన్నుడు, సాహసవంతుడు, శత్రువులకు కలలో కూడా బెబ్బులిలా కనబడేవాడు. కాని జయాపజయాలు ఎప్పుడూ ఒకే తీరుగా ఉండవు కదా! బ్రూస్ శత్రువులు అవకాశం చూసుకుని స్కాట్లాండ్‌పై దండెత్తారు. చక్రవర్తిని పరాజయంపాలు చేశారు. బ్రూస్ భరింపరాని పరాభవంతో యుద్ధ మైదానం నుండి తప్పించుకుపోయాడు. శత్రువుల కంట కనబడకుండా ఒక నిర్జన ప్రదేశం చేరుకున్నాడు. ఏకాంతంలో దుఃఖభారంతో కుమిలిపోయిన వదనంతో మళ్ళీ శత్రువులపై దండెత్తడానికి బలంలేక అలసిసొలసి అర్థంకాని స్థితిలో కూర్చుండిపొయ్యాడు. రాబర్ట్ బ్రూస్ నేలపై చతికిలబడ్డాడు. తన కర్తవ్యం ఏమిటి? అని దీర్ఘాలోచనలో నిమగ్నుడయ్యాడు. ఇంతలో అకస్మాత్తుగా ఆయన దృష్టి తాను దాగి ఉన్న గుహ కప్పు భాగంపై పడింది. అక్కడి నుండి ఒక సాలెపురుగు క్రిందపడింది. గూటి నుండి పడిన సాలె పురుగు తన గూటి పోగు పట్టుకుని మళ్ళీ గూడు చేరేందుకు ప్రయత్నం చేస్తోంది. సాలె పురుగు పోగు బలమెంత? దాని మీద ఆధారపడితే కలిగే ప్రయోజనమెంత? సాలె పురుగు పోగు పట్టుకుని కొంతవరకు వెళ్ళిందో లేదో తన బరువుతోనే తాను మళ్ళీ క్రిందపడేది. కాని సాలె పురుగు మాత్రం ధైర్యం విడువక మళ్ళీ ప్రయత్నం చేసేది. ఓసారి ప్రయత్నంలో

కొంతపైకి ప్రాకేదో లేదో మళ్ళీ యథాప్రకారం క్రిందపడేది. సాలె పురుగు గూడు చేరాలనే తన ధ్యేయంతో ప్రయత్నం విడువక కృషి చేస్తూ, ప్రతిసారి తన ఆశల్ని పెంచుకుంటూ గూటిని చేరుకునేంతవరకు వదల్లేదు. ఏ మాత్రం నిరాశకు లోనవకుండా మళ్ళీ మళ్ళీ ప్రయత్నం చేస్తూ గూటికి చేరింది. హాయిగా నిద్రించింది. నేలపై పరుండి ఇదంతా చూస్తూ ఉన్న చక్రవర్తికి సాలె పురుగు చూపించిన అచంచల విశ్వాసం, ఆత్మస్థయిర్యం, కార్యదీక్షాదక్షతల వల్ల గుణపాఠం కలిగింది. ఈ సంఘటన అతని జీవితాన్నే మార్చివేసింది. ఇక విప్లవం కోసం కృషి చెయ్యాలని కంకణం కట్టుకున్నాడు బ్రూస్. 'ఉఫ్' అని ఊదితే పడిపొయ్యే సాలె పురుగులో ఇంతటి కార్యదీక్షాస్థయిర్యాలున్నప్పుడు, జీవరాసులన్నింటిలోకి ఉత్తమ జీవిగా సృష్టింపబడిన మానవుడు నిరాశ చెంది, బాధపడటం ఎంత మాత్రం తగదని తలిచాడు బ్రూస్. కృషి చెయ్యడానికి మళ్ళీ సంకల్పించాడు. ఛిన్నాభిన్నమయిన తన సైన్యాన్ని సమీకరించాడు. శత్రు సేనలపై విరుచుకుపడ్డాడు. విజయభేరి మ్రోగించాడు. పోగొట్టుకున్న సామ్రాజ్యాన్ని మళ్ళీ స్వాధీనపరుచుకున్నాడు.

ఇలాంటి మరో సంఘటన తైమూర్ లంగ్ జీవితంలో కూడా ప్రసిద్ధికెక్కింది. తైమూర్ మొగలాయి చక్రవర్తి. పేరు ప్రఖ్యాతులు పొందినవాడే. తైమూర్ కాలు ఒకటి కుంటుపడ్డం వల్ల ఆయన్ని తైమూర్ లంగ్ అని పిలిచేవారు. గుండె బలం కలవారికి కుంటి కాలు అడ్డమా? ఎన్నో రాజ్యాలపై దండెత్తాడు. వాటినన్నిటిని వశపర్చుకున్నాడు. కాని ఒక పర్యాయం యుద్ధంలో పరాజయాన్ని చవి చూశాడు. సైన్యం చెల్లాచెదరయింది. ప్రాణ రక్షణ కోసం స్వయంగా ఒక కొండ గుహలో తలదాచుకున్నాడు. సైన్యాన్ని కోల్పోయి ఏకాంత స్థితి ఒక వైపు, పరాజయపు పరాభవం మరోవైపు ఆయనను వేధించసాగాయి. నిరాశానిస్పృహలతో ఏమీ తోచక కూర్చుండిపొయ్యాడు. అకస్మాత్తుగా ఆయన దృష్టి ఒక చీమపై పడింది. ఆ చీమ ఒక గింజ తీసుకుని పైకెక్కడానికి ప్రయత్నిస్తూ ఉంది. గింజ చీమ కన్నా చిన్నది కాదు. అందుచేత దాన్ని పైకి తీసుకువెళ్ళడం చీమకు చేతనయ్యే పనికాదు. కాని ఆ చిట్టి జీవి ధైర్యం వదల్లేదు. దైవం దానికి బలంతో పాటు గుండె ధైర్యం కూడా ఇచ్చాడు. ప్రతి పర్యాయం తనకన్నా పెద్దదయిన ఆ

గింజను తీసుకుని కొంత దూరం పైకి ప్రాకడం ఆ తరువాత క్రిందపడటం మళ్ళీ పైకి తీసుకువెళ్ళడం ఇలా జరుగుతూనే ఉంది. చివరకు ఎలా అయితేనేమి, చీమ ఆ గింజను పట్టుకునే తన బిలానికి చేరింది. ఆ విజయంతో విశ్రాంతి తీసుకుంది.

ఈ దృశ్యం తైమూర్ లంగ్‌ను ప్రభావితం చేసింది. "దేవుడు సృష్టించిన ఈ చిన్న ప్రాణికి ఇంతటి ధైర్యం, దృఢ సంకల్పం, పరాజయం చెందినా నిరాశకు లోనుకాకుండా నిరంతరం కృషిసాగించే గుణం ఉంటే, నేను ఒక్కమారు ఓడిపోయానో లేదో కాళ్ళు చేతులు కట్టుకుని దద్దమ్మలా కూర్చుండి పోవడమేమిటి? ఛీ, ఇది కూడా ఒక జీవితమేనా!" అని అనుకుని మళ్ళీ బలం పుంజుకున్నాడు. పారిపోయిన సైనికులనందరినీ సమీకరించి, వారిని పటిష్టపరిచాడు. ఆత్మస్థయిర్యంతో శత్రు సేనల గుండెలు గుభేలుమన్నట్లు వారిపై దాడి చేశాడు. విజయం సాధించాడు.

చూశారా! చీమ కానివ్వండి, సాలె పురుగు కానివ్వండి. వాటికి ఏ మాత్రం బలం లేకపోయినా గుండె బలంతో పట్టుదల విడువక చేపట్టిన పనిని పూర్తి చేసేంతవరకు తమ కృషిని వదల్లేదు. అలాంటప్పుడు నిరాశానిస్పృహలకు లోనయి లక్ష్య సాధనలో కృషి మానడం మనిషికి తగునా?

విధి నిర్వహణ

సమాజంలోని ప్రతి పౌరునికి కొన్ని హక్కులున్నాయి. ఆ హక్కులను అందజేయడానికే పరిపాలన, పదవులు, సమాజంలో ఉన్న హోదాలు. పదవులు ప్రజల హక్కుల రక్షణ కోసమే కదా! చట్టాలు కూడా హక్కుల్ని పరిరక్షించేందుకు చేయబడతాయి. కాని ప్రతి అధికారిలో, పదవిగల వ్యక్తిలో విధి నిర్వహణకై బాధ్యతాభావం ఉన్నప్పుడే ఈ హక్కుల సంరక్షణ సాధ్యమవుతుంది. నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, సోమరితనం లాంటివి పౌరుల హక్కుల్ని హరించివేస్తుంటాయి.

హక్కులు కోల్పోయినవారు దుఃఖభారంతో నిండిన జీవితాన్ని గడుపవలసివస్తుంది. అధికారులు తమ విధి నిర్వహణలో, ప్రజా హక్కుల సంరక్షణలో జాప్యం చేసినట్లయితే దైవం వారిని శిక్షిస్తాడు.

అందుచేతనే ప్రతి వ్యక్తి తన హక్కులు రాబట్టుకునేందుకు ముందు బాధ్యతల నిర్వహణ పట్ల ఆసక్తి చూపడం, వాటిని సముచితంగా నిర్వహించడం అవసరం. ఇదే ఉత్తమ గుణంగా పరిగణించబడుతుంది.

సన్మార్గగాములయిన ఖలీఫాలు తమ బాధ్యతలను బాగా గుర్తించినవారు. వారి పరిపాలనా కాలంలో రాజకీయ వ్యవస్థ ఆదర్శవంతంగా ఉండింది. ప్రతి పనిని వారు దైవాదేశాల ప్రకారం చేసేవారు. మహా ప్రవక్త ముహమ్మద్ (స) మానవ మనుగడ కోసం చూపించిన ఆదర్శ మార్గాన్ని పాటించేవారు.

కాలక్రమేణా పరిస్థితులు మారుతూ వచ్చాయి. గద్దెలనెక్కిన నేతలు విధులను విస్మరించారు. అక్రమ మార్గాల్ని పాటిస్తూ అధికారాలను దుర్వినియోగం చేస్తూ పూర్వపు రాచరిక పద్ధతుల్ని పాటించసాగారు. ప్రభుత్వ ధనాగారం చేరిన డబ్బును ప్రజల అమానతుగా భావించక తమ స్వంత సిరిలా పరిగణించసాగారు. తమ జీవితాలను భోగభాగ్యాలలో గడుపుతూ, ప్రభుత్వ ధనాన్ని వినియోగించుకుంటూ విచ్చలవిడిగా వ్యవహరించసాగారు. అధికారాలన్నీ తమ తమ కుటుంబ సభ్యులకే పరిమితం చేసుకుని నిరంకుశ రాజ్యపాలన చేస్తూ వచ్చారు. ఆశ్రిత పక్షపాతం పెచ్చుపెరిగిపోయింది. సహజంగానే దాని ప్రభావం ప్రజలపై పడింది. దౌర్జన్యం విపరీతం కాసాగింది. ప్రజలు తమ హక్కుల్ని కోల్పోసాగారు. సమాజం ప్రగతిని వదలి అధోగతిపాలయింది.

ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డప్పుడు దైవ నిర్ణయం తన పనిచేసుకుంటూ పోతుంది. దుష్ట శిక్షణ కోసం, శిష్ట రక్షణ కోసం నిస్వార్థపరులు నేతలుగా ప్రభవింపజేయబడతారు. అట్టివారిలో పేరుగన్న వ్యక్తి ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్.

దైవభీతి కలవారు, మహాప్రవక్త (స) స్థాపించిన ఆదర్శ రాజకీయ వ్యవస్థను ఏ విధంగా ప్రారంభంలో ఖలీఫాలు ఖాయపరచి ప్రజారంజకంగా పరిపాలన చేశారో అదే విధంగా తాను కూడా పరిపాలించాలని తహతహలాడేవారు. ఆ కృషి ఫలించింది కూడా.

సులైమాన్ బిన్ అబ్దుల్ మలిక్ స్వర్గీయులయిన తరువాత ఆయన అంత్యక్రియలు జరిపించి దినమంతా నిర్విరామంగా గడిపారు. ఇక రాత్రి ప్రజల నుండి 'బయత్' (ప్రజా ప్రతినిధి కావడానికి ప్రమాణాలు) తీసుకున్నారు. ఈ విధంగా రేయింబవళ్ళు వివిధ కార్యకలాపాలలో నిమగ్నమై ఉండడం వల్ల కాస్త బడలికగా ఉండింది. మరుసటి దినం ఫజ్ర్ ప్రార్థనానంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని అధికార కార్యకలాపాలు చూచుకుందామని అనుకున్నారు ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్. అలా యోచిస్తున్న సమయంలో అతని కుమారుడు వచ్చి ఇలా అన్నాడు: "నాన్నా! ఏమిటీ అలా ఆలోచిస్తున్నారు?" "ఆఁ ఏమీ లేదు. కాస్త ఒళ్ళంతా నొప్పిగా ఉంది. రాత్రంతా నిద్ర లేకపోవడం వల్ల తల భారంగా ఉంది. కాస్త విశ్రాంతి తీసుకోదలిచాను" అన్నారు ఖలీఫా. "ప్రజలంతా మీ వైపు దృష్టి మళ్ళించి మీ కోసం ఎదురుచూస్తున్నారు. మీరేమో విరామం కావాలని అనుకుంటున్నారు. దౌర్జన్యపరులెందరో బలహీనుల హక్కుల్ని కొల్లగొడ్తున్నారు. హక్కుల్ని కోల్పోయిన వారు ఎందరో న్యాయం చెయ్యమని మిమ్మల్ని అర్థించడానికి ఎదురుచూస్తున్నారు. ఖలీఫా వస్తారు కదా! మాకు న్యాయం కలుగుతుంది కదా! మా సమస్యలు పరిష్కారమవుతాయి కదా! మా బాధలు కడతేరుతాయి కదా! అని ఎందరో ఎన్నో విధాలుగా మీపై ఆశలు పెట్టుకుని ఉన్నారు" అని అన్నాడు ఖలీఫా తనయుడు. "నాయనా! ఏమీ అనుకోకు. నిద్ర కొరత వల్ల నిలకడలేని ఆరోగ్యంతో బాధపడుతున్నాను. కొద్దిసేపు నిద్రపోయానంటే నా ఆరోగ్యం కుదుటపడుతుంది. మధ్యాహ్నం మామూలు ప్రకారం అన్ని సమస్యలూ సవ్యంగా పరిష్కరిస్తాను" అని అన్నారు ఖలీఫా. కాని తనయునికి తృప్తి కలుగలేదు. ఇలా

అన్నాడు, "నాన్నా! నేనొక ప్రశ్న వేస్తాను. సమాధానం ఇవ్వండి, మీరు మధ్యాహ్నం వరకు బ్రతికి ఉంటారని గ్యారంటీ ఏమిటీ? దురదృష్టవశాత్తూ నిద్రలో ఉన్నప్పుడే శ్వాస కాస్తా పోయిందంటే మీరేం చేయగలరు? బాధ్యతల్ని నిర్వహించకుండా ప్రపంచాన్ని వదలి వెళ్ళాక రేపు దైవ సమక్షంలో హాజరయ్యాక ఏం సమాధానం చెప్పుకుంటారు."

తనయుడు పలికిన పసిడి పలుకులు ఖలీఫా హృదయాన్ని కదిలించివేశాయి. వెంటనే అతన్ని కౌగిలించుకున్నారు. విశ్రాంతి మాట మరచిపొయ్యారు. బాధ్యతల్ని మొదట నిర్వహించాలని గుర్తించారు. వెంటనే సభకు వెళ్ళి, అక్కడ వేచి ఉన్న ప్రజల సమస్యల్ని పరిష్కరిస్తూ తన బాధ్యతను నిర్వహించారు.

అప్పు

కలిమిలేములు కావడి కుండలంటారు. పగలూ రేయిల్లాంటివంటారు. నిజమే. రెండు స్థితుల్లోనూ తన మానసిక స్థితిని సమతూకంలో ఉంచగలవాడే ఉత్తముడయిన మనిషి. అవి మారుతుంటాయి. సౌభాగ్య సిరి ఒకరిని వరిస్తే దౌర్భాగ్య శని మరొకరిని పట్టుకుంటుంది. పరిస్థితులు ఒక్కొక్కరిని ఒక్కొక్కప్పుడు ఇతరుల్ని ఆశ్రయించడానికి పురికొల్పుతాయి. అవసరమున్నవారికి చేతనయినంత సహాయం చెయ్యడం ధనవంతుల ధర్మం. కాని కష్టపడి సంపాదించిన డబ్బును నేనెందుకు ఇతరులకివ్వాలని తలిస్తే అది స్వార్థం అనబడుతుంది. తీసుకొన్న సహాయంతో రుణగ్రస్తునికి లాభం కలుగుతుంది కదా. వడ్డీ రూపేణా లేదా మరో విధంగా అప్పిచ్చువాడు రుణగ్రస్తుని నుండి లాభం పొందడానికి ప్రయత్నిస్తే అది కేవలం అధర్మమే కాదు, మహా పాతకమని ప్రబోధిస్తుంది ఇస్లామీయ శాస్త్రం. కోరినవారికి అప్పు ఇవ్వడం న్యాయం, మానవత్వం; కాని అప్పు తీర్చుకోక పొయ్యేడంటే అలాంటి వ్యక్తిని మాఫీ చెయ్యడమనేది పుణ్యప్రదం.

వడ్డీలేని ఇస్లామియ ఆర్థిక విధానంలో ఎటువంటి ఆదర్శవంతమయిన సంఘటనలు జరిగాయో గమనించండి. భారత దేశాన్ని పరిపాలించిన మహారాజులలో సికిందర్ లోఢి పేరుగన్నవాడు. స్వతహాగా మంచి గుణాలు కల మనిషి. దైవాజ్ఞల ఎడల అమిత గౌరవం కలవాడు. ఆయన పరిపాలనా కాలంలో జైనుద్దీన్ అనే ఒక మహనీయుడుండేవాడు. ఐశ్వర్యం, అధికారం గలవాడు. అయినప్పటికీ భోగలాలసుడై సమయాన్ని దుర్వినియోగపరిచేవాడు కాదు. సదా మంచి పనుల్లో నిమగ్నమయి ఉండేవాడు. ఏదయినా ఆశించివచ్చిన వారందర్ని కాదనక లేదనక ఆదరించి వారి అవసరాల్ని తీర్చేవాడు. మానవత్వం మూర్తీభవించిన సహృదయుడు. దైవభీతి కలవాడు. నిత్యం దైవారాధనలో నిమగ్నుడయి ఉండేవాడు. అతని మంచితనం, మానవ సేవ, దైవధర్మపరాయణతను చూచి సుల్తాన్, అతడంటే ఎంతో గౌరవం చూపేవాడు.

ఎంత మంచివారినయినా మోసపుచ్చే మనుషులెందరో ఉంటారు. ఒక శుక్రవారం నాడు జరిగిన విషయం. ఏదో పని మీద సుల్తాన్ లోఢి జైనుద్దీన్‌ని 3 మార్లు పిలువనంపాడు. కాని క్రమబద్ధమయిన జీవితం గడిపే జైనుద్దీన్ శుక్రవారపు కార్యక్రమాల్ని, ఆరాధన, దానధర్మాలను వదలివెళ్ళడానికి ఇష్టపడలేదు. ఇదే సమయం చూచి ఓర్వలేని భటులు సుల్తాన్ వద్దకు వెళ్ళి ఆయనపై లేనిపోని చాడీలు కల్పించి మరీ చెప్పారు. "ఓ మహారాజా! ఆయన ఇప్పుడు గర్విష్టి అయ్యాడు. నేను మూడుసార్లు స్వయంగా వెళ్ళి రాజదర్బారుకు రావలసిందని సవినయంగా విన్నవించుకున్నాను. అయినా ఆజ్ఞను ఖాతరు చెయ్యలేదు" అని అన్నాడొక బంట్రోతు.

పాదుషా మంచి చెడులను గుర్తించేవాడు. "ఓ! నాకు జ్ఞాపకం లేదు. ఈ దినం శుక్రవారం కదూ! శుక్రవారం నాడు జైనుద్దీన్ దైవధ్యానంలో నిమగ్నుడయి ఉంటాడు. ఇల్లు విడిచి బయటికెళ్ళడు. ఏమీ ఫరవాలేదు, విరామం దొరికితే ఆయన తప్పక వస్తాడ"ని అన్నాడు లోఢి. ఆనాటి నుంచి రాజ దర్బారీలు జైనుద్దీన్ మీద పగబట్టారు.

కాలం అవకాశాలను కల్పిస్తుంది. మానవ కృషి ఒక వైపు, దైవేచ్ఛ మరో వైపు పనిచేస్తుంటాయి. పరీక్ష కోసం దైవం మానవుల పరిస్థితుల్ని మారుస్తూ ఉంటాడు. సుల్తాన్ దివంగతుడయ్యాడు. ఓర్వలేని దర్బారీలు జైనుద్దీన్‌ని అష్టకష్టాలపాలుజేశారు. అతడనుభవిస్తున్న భోగభాగ్యాలు అంతమయ్యేలా చూశారు. ఐశ్వర్యం కోల్పోయ్యాడు జైనుద్దీన్. అలలెన్ని వచ్చినా అవధి దాటని పయోనిధి వలె జైనుద్దీన్ కష్టాలను భరించాడు. విశాల హృదయంతో ఎవరిపై పగ తీర్చుకోకుండ, కక్షలకు దిగకుండ, యధావిధిగా తన దినచర్యల్లో నిమగ్నమై కాలం గడిపేవాడు.

ఒక దినం తన దగ్గరున్న దస్తావేజులన్నీ తీయించాడు. వాటినన్నింటినీ చింపివేశాడు. పైగా నౌకరును పిలిచి ఆ దస్తావేజులపై ఉన్న వ్రాతనంతా క్షుణ్ణంగా పోయేట్టు తుడిచి వేయమన్నాడు. దస్తావేజులపై వ్రాసి ఉన్న ఒక్క అక్షరం కూడా కనబడకుండా ఉండాలని నౌకరుకు చెప్పాడు. అలానే నౌకరు మనసు లగ్నం చేసి తన పని చేస్తున్నాడు. ఇంతలో జైనుద్దీన్ రుణగ్రస్తుడొకడు అక్కడకి వచ్చాడు. తుడిచివేస్తున్న దస్తావేజుల ముక్కల్ని చూచాడు. ఆశ్చర్యపొయ్యాడు. దస్తావేజులంటే మామూలు మాటలా! వాటి ఆధారంగా కచ్చేరీలకెక్కి రుణగ్రస్తుల్ని అప్పు చెల్లించేవరకు ఏడు చెరువుల నీళ్ళు త్రాగించవచ్చు.

అతడు జైనుద్దీన్‌తో కలసి ఏమిటి సమాచారం అని అడిగాడు. "ఏమీ లేదు. ధనవంతునిగా ఉన్నప్పుడు ఎందరో అవసరాలకొద్దీ నా దగ్గర డబ్బు తీసుకొన్నారు. అప్పిచ్చే సమయంలోనే వాటిని రాబట్టుకొనే తలంపు నా మనస్సులో లేదు. వద్దంటే కూడా వారు ఈ దస్తావేజుల్ని వ్రాసి పంపారు. ఇప్పుడేమో నేను లేమికి గురయ్యాను, ఏదయినా దురాశ నాలో కలిగితే అప్పు పుచ్చుకున్నవారిని రచ్చకు లాగే తలంపు నాలో కలగవచ్చు. ప్రారంభంలోనే నా సంకల్పానికి అది వ్యతిరేకమవుతుంది. అందుచేత దస్తావేజులన్నీ చింపించాను. వాటిపై ఉన్న అక్షరాల్ని సమూలంగా తుడిచేయిస్తున్నాను. అప్పు వసూలు చేసే సంకల్పం నాలోకాని, నా వారసుల్లోకాని రేపు కలగకూడదనే ఈ పని చేస్తున్నా"నన్నాడు జైనుద్దీన్. రావలసిన అప్పుల మొత్తం అప్పటి కాలంలోనే ఐదు లక్షలకుపైగా ఉంది.

చూశారా! దైవధర్మ పరాయణుడు - కలిమిలేములననుభవించే రెండు పరిస్థితుల్లోనూ మనస్సు మార్చుకోకుండా, ఇచ్చిన అప్పును అడుగకుండా మున్ముందు తన వారసులకు - రుణగ్రస్తులతో ఎలాంటి వివాదాలు రాకుండా ఎలా ప్రవర్తించాడో!

ప్రవక్త(స) పట్ల ప్రేమ!

డాక్టర్ అల్లామా ఇక్బాల్ అంటే తెలియని వ్యక్తి భారత దేశంలో లేడు. పాశ్చాత్య దేశాలలో ఉన్నత విద్యనభ్యసించారు. బారిస్టర్ అయ్యారు. డాక్టరేట్ డిగ్రీ పొందారు. ఆ కాలంలో ఇలాంటి ఉత్తమ విద్య అభ్యసించే మహాభాగ్యం ఏ కొందరికో కలిగేది. పైగా ఉర్దూ, పర్షియన్ బాషల్లో చక్కటి పాండిత్యం సంపాదించారు. ఎన్నో అరబీ గ్రంథాలను చదివి ఇస్లామీయ ధార్మిక విద్యను జీర్ణించుకో గలిగారు. భారత ఉపఖండంలో అనన్యమయిన కావ్య రచన చేసి ప్రాచ్య కవి అనిపించుకున్నారు. రాజకీయాలను కూడా ఆయన ప్రభావితం చేశారు.

నిరాడంబరత ఆయన జీవితంలో సుస్పష్టంగా కనబడేది. ఎన్నో ప్రత్యేకతల కారణంగా ఆంగ్ల ప్రభుత్వం కూడా ఆయనకు 'సర్' అనే ఖితాబు ఇచ్చి సత్కరించింది. ఆయన చెప్పిన ఒక్క ద్విపది అయినా ఉదహరించనిదే ఉపన్యాసకులు, పార్లమెంటేరియనులు, ప్రధానులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, స్పీకర్లు తమ ప్రసంగాలు ముగించరు.

పంజాబ్ ఆయన స్వరాష్ట్రం. అప్పట్లో రాజకీయ విప్లవం కోసం ఎటు చూసినా సభలు సమావేశాలు, సమాలోచనలు జరుగుతుండేవి. పంజాబ్‌లోని ధనవంతుడొకడు ఏదో సమస్యను చర్చించేందుకు అల్లామా ఇక్బాల్‌తో పాటు ఇతర అగ్రశ్రేణి న్యాయవాదులను ఆహ్వానించాడు. తన ఇంటిలోనే అందరికీ బస ఏర్పాటు చేశాడు.

చాలా ప్రొద్దుపొయ్యేవరకు సమాలోచనలు జరిగాయి. ఇక విశ్రాంతి కోసం డాక్టర్ గారు తన గది చేరారు. అక్కడున్న ఏర్పాట్లు చూసి ఆశ్చర్యపోయారు.

ఆ మెత్తలు, పరుపులు, విలాసవంతమయిన రాజుల శయన మందిరాలను తలపింపజేసే ఆ హంగామా చూచి, ఒక్కమారు మహాప్రవక్త (స) నిరాడంబర జీవితాన్ని స్మరించుకున్నారు. ఈనాడు మాకు సమాజంలో లభించే గౌరవమర్యాదలన్నీ మహాప్రవక్త ముహమ్మద్ (స) మనకందించిన విజ్ఞాన సంపత్తి వల్ల, ఆయన అడుగుజాడల్లో నడుచుకోవడం వల్ల ప్రాప్తమయినవే కదా! కాని మహాప్రవక్త (స) తన జీవితాంతం ఖర్జూరపు ఆకులతో చేసిన చాపలపై నిద్రిస్తూ ఉండేవారు. వీపు మీద చాప గురుతులు పడుతుండేవి అని తలచుకుంటూ కన్నీరు మున్నీరుగా దుఃఖించారు. చివరికి నౌకరు ద్వారా ఓ నులక మంచం తెప్పించి ప్రక్కనున్న స్నానాల గదిలోనే వేయించుకున్నారు. దానిపై వెంట తెచ్చుకున్న పరుపును విప్పుకున్నారు. ఆ విధంగా ఆ రాత్రి గడిపారు.

విద్య పట్ల గౌరవం

ప్రతి కాలంలోనూ విద్యావంతులు ఉంటారు. విజ్ఞానానికున్న విలువ వారికి తెలుసు. విద్యనభ్యసించే తృష్ణతో తమ వద్దకు వచ్చేవారినందరికీ విద్యాభిక్ష పెడతారు. అలాంటి విద్యావేత్తలు తల్లిదండ్రుల మాదిరిగా విద్యార్థుల మధ్య తారతమ్యం చూపరు. వారి దృష్టి ఎప్పుడూ తమకు తెలిసిన విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించడంపైనే ఉంటుంది.

హారూన్ రషీద్ పేరుగల ముస్లిం పరిపాలకుడు బాగ్దాదు ముఖ్యపట్టణంగా పెద్ద సామ్రాజ్యాన్ని పరిపాలించారు. ఓసారి పవిత్ర మదీనా నగరాన్ని దర్శించడం కోసం వెళ్ళారు. వెంట మామూన్, అమీన్ అనే తన తనయుల్ని కూడా తీసుకువెళ్ళారు.

మదీనా పట్టణంలో ఒక సుప్రసిద్ధ పాఠశాల ఉండేది. మహాప్రవక్త(స) నిర్మించిన మసీదు ఆవరణలోని ఆ పాఠశాలలో ఇమామ్ మాలిక్ (రహ్మాలై) ధర్మగ్రంథ ప్రబోధం చేసేవారు. ఆయన ప్రసిద్ధ పండితుడేకాక అందరూ గౌరవించే దైవజ్ఞుడు కూడ. హదీసు విద్యలో ఆరితేరిన ప్రవీణులు. ఆయన చెప్పే

హదీసు పాఠం వినేవారందరు విద్యార్థులు కానివ్వండి, ఇతర పండితులు కానివ్వండి ముగ్ధులయ్యేవారు. అందుచేతనే దూర ప్రాంతాల నుండి ఎందరో విద్యార్థులు ధార్మిక విద్య అభ్యసించడానికి అక్కడికి వచ్చేవారు. ఆ పండితోత్తముడు అనుగ్రహించే విజ్ఞాన సంపత్తిని పొంది ఉన్నత పండితులుగా స్వదేశాలకు పోయేవారు. హారూన్ రషీద్ మదీనా వచ్చారు కదా! అక్కడ ఉన్న విద్యాలయ విశిష్టతను విన్నారు. విద్య అంటే ఎనలేని ప్రేమ ఆయనకు. తన తనయుల్ని ఎలాగయినా సరే ఇమామ్ మాలిక్ వద్ద చదువు నేర్పించదలచారు. కాని రాకుమారులు కదా! సామాన్య విద్యార్థులతోపాటు ఒకే పంక్తిలో కూర్చుని ఎలా చదువగలరు? అందుచేత సవినయంగా ఇమామ్ మాలిక్ వద్దకు కబురంపారు. "నా కుమారులు మామూన్, అమీన్ మీ వద్ద చదవాలని ఉన్నారు. మీ దీవెనలనందుకోవాలని వేచి ఉన్నారు. కాని రాకుమారుల్ని పాఠశాలకు పంపడం నాకు మొహమాటంగా ఉంది. మీరే స్వయంగా వచ్చి వారికి విద్యా బోధన చేశారంటే ఎంతో బావుంటుంది."

ఇమాం మాలిక్ ఆత్మాభిమానం మెండుగాగల ధర్మజ్ఞుడు. విద్యను తాకట్టు పెట్టి పదవుల మోజులో పడలేదు. రాజుగారికి జవాబు పంపాడు: దప్పిగొన్నవారి వద్దకు నుయ్యి రాదు, దప్పి గొన్నవాడే నుయ్యికి వెళ్ళాలి. విద్యా దాహం తీర్చుకోవడానికి విద్యార్థి స్వయంగా విద్యాలయానికి వస్తాడు. అందుచేత ఓ పాదుషా! ఈ విద్య మీ గృహం నుండే బయల్దేరింది. దాన్ని కించపరచదలిచారా?

హారూన్ రషీద్ మరోసారి ప్రయత్నిస్తూ, "పండితవర్యా, అమీన్, మామూన్‌ను మీ విద్యాలయానికి పంపడంలో నాకు అభ్యంతరం లేదు. కాని కాస్త రాకుమారులనే భావంతోనయినా వారికి పాఠమిచ్చే సమయంలో ఇతర విద్యార్థులు లేకుండా చూడండి" అని అర్థించాడు. ఇమామ్ మాలిక్ ఇలాంటి డొంక తిరుగుడు మాటలకు లొంగగలరా? వెంటనే ప్రత్యుత్తరం ఇస్తూ, "ఈ జవాబు వ్రాస్తూ నాకు చాలా బాధ కలుగుతోంది. మీరు ఇచ్చిన ఈ ఆజ్ఞను కూడా నేను శిరసావహించలేను. ఇస్లామ్ మానవులకు ప్రేమ సౌభ్రాతృత్వాలతోపాటు,

సమానత్వాన్ని ప్రబోధిస్తోంది. మహాప్రవక్త (స) మస్జిదులో కూర్చుని ఇలా విద్యార్థుల మధ్య వ్యత్యాసం చూపమంటే ఎలా సాధ్యమవుతుంది" అని వ్రాసి పంపారు.

ఇమామ్ మాలిక్ జవాబు విని రాజు ప్రభావితుడయ్యారు. తన తనయులిద్దరినీ పండితుని సమక్షంలో హాజరుపరిచారు. ఆ రాకుమారులు తోటి విద్యార్థులతో కలసి, ఒకే చోట కూర్చుండి ఎంతో కాలం వరకు విద్యనభ్యసించారు.

తృప్తిలోనే పరమానందం

సికిందర్ మెగ్దూనియాను పరిపాలించాడు. సామ్రాజ్య విస్తరణ అతని ఏకైక ధ్యేయం. ప్రపంచానికంతా తానే చక్రవర్తిని కావాలనే ఆశ అతనికి చిన్నతనంలోనే కలిగింది. ఆశించిన ధ్యేయాన్ని నెరవేర్చుకొనేందుకు అనేక యుద్ధాలు చేశాడు. చేజిక్కిన రాజ్యాలన్నీ వశపరచుకున్నాడు. తన ముందు నిలువగల రాజు లేడంటూ ప్రకటించుకొంటూ వచ్చాడు. దేశ విదేశాలు దాటుతూ భారతదేశాన్ని కూడ చేరాడు. యావత్తు భారత దేశాన్ని హస్తగతం చేసుకోవాలని కలలుగన్నాడు. ఆశించేదొకటి, జరిగేదొకటి అన్నారు పెద్దలు. సికిందర్ సైన్యం ఎన్నో యుద్ధాలు చేస్తూ, దూర దేశ ప్రయాణాలతో బడలిక చెందడం వల్ల ముందుకు సాగడానికి నిరాకరించింది. సేనల మాటను కాదనక సికిందర్ వెనకకు మరలిపోవలసి వచ్చింది. తిరుగుప్రయాణంలో బాబిలోనియాలో దివంగతుడయ్యాడు. ఈ సంఘటన ఈసా (అలైహిస్సలామ్) ప్రవక్తకు 300 సంవత్సరాల ముందు జరిగింది.

సికిందర్ చక్రవర్తి కాలంలో జరిగిన ఒక సంఘటన వినండి. ఆయన కాలంలో ఒక మహర్షి ఉండేవాడు. ఆయన పేరు దేవ్‌భాన్స్ కల్బీ. పట్టణ ప్రాంతాలకు దూరంగా ఒక పర్వత శ్రేణిలో కుటీరాన్ని ఏర్పరచుకొని అక్కడే కాలం గడిపే వాడు ఆ మహర్షి. ప్రజలంతా ఆయన ఘనతను, ఆధ్యాత్మిక శక్తిని వేనోళ్ళ పొగిడేవారు. ప్రజలంతా ఎరిగిన సత్యం ప్రభువు వరకు చేరకపోతుందా! సికిందర్ ఆ విషయాన్ని విన్నాడు. ఆ మహర్షిని సందర్శించడానికి వెళ్ళాడు. చలికాలం

కావటం మూలాన కుటీరం బయట ఆ మహర్షి ఎండ కాచుకుంటూ, ధ్యానంలో నిమగ్నుడయి ఉన్నాడు. సికిందర్ ఆయన్ని సమీపించాడు. వినయంతో అభివాదం చేశాడు. మహర్షిపై ఎండ పడుతున్న వైపు నిలబడ్డాడు సికిందర్.

భాన్స్ ప్రపంచాన్నేలే ప్రభువు తన వద్దకు వచ్చినా ఖాతరు చేయలేదు. ధ్యానం చేస్తూ చలించలేదు. సికిందర్ ఎంత సేపటికీ లౌకిక దృష్టి గలవాడే గనక మహర్షికి అక్కడ కలిగే ఐహిక కష్టాలను గురించి పరిశీలించాడు. కావలసిన ఏర్పాట్లు చేయదలచి "మహాశయా! మీకిక్కడ ఎన్నో కష్టాలు కలుగుతుంటాయి. మీరు సెలవిస్తే అన్ని ఏర్పాట్లు క్షణాలలో చేయగలను" అన్నాడు సికిందర్.

దేవ్‌భాన్స్‌కు సికిందర్ అంటే ఎవరో తెలుసు. పేరు ప్రతిష్టల కోసం ఎన్ని రాజ్యాల్ని దిగమింగాడో, ఎందరిని చంపాడో నిరంతర దౌర్జన్యంతో ప్రజలనెంత బాధించాడో బాగా తెలిసినవాడవటం వల్ల, అలాంటి వ్యక్తి నాకేమి మేలు చేయ గలడు అని భావించి, "కాస్త జరుగు నాయనా! నాకు ఎండ తగలనీ, నీవు వచ్చి నాకు లభించే ఆ కాస్త ఎండకు అడ్డుపడుతున్నావు. నీ నుండి నాకేం అవసరంలేదు. చలి కాచుకోవడానికి వెచ్చదనాన్ని కల్గించే ఈ ఎండను వాడుకోనిస్తే చాలు" అని అన్నాడా మహనీయుడు.

ఈ మాటలకు సికిందర్ ఖిన్నుడయ్యాడు. ఆశకు అంతులేదు. దేవుడిచ్చిన అనుగ్రహంతో మానవుడు తృప్తినొందడం లేదు. తృప్తిని కోల్పోయిన వ్యక్తి దురాశపరుడవుతాడు, దౌర్జన్యం చేస్తాడు. ఇతరుల హక్కుల్ని కొల్లగొట్టుతాడని వెంటనే గ్రహించి, తన దారిన తాను వెళ్ళిపోయాడు సికిందర్.

త్యాగం

అది హజ్రత్ అబూబకర్ (రజి) పరిపాలనా కాలం. ఇంతకు ముందే పరాజయాన్ని చవిచూచిన రోమన్లు విశ్వాసులపై దండెత్తి యర్మూక్ అనే ప్రాంతంలో ఎదుర్కొన్నారు. రోమను సైనికులు అసంఖ్యాకంగా వచ్చి అల్ప సంఖ్యలో ఉన్న

ముస్లిమ్ ముజాహిద్‌లపై దాడి చేశారు. యుద్ధాలలో సైనికుల సంఖ్య కంటే వ్యూహరచన అద్భుతంగా పనిచేస్తుంది. పేరుగన్న సేనాధిపతి హజ్రత్ ఖాలిద్ (రజి) ఆ యుద్ధ వ్యూహరచన చేసి భారం దైవంపై మోపారు. విరోధులపై విజృంభించారు. రోమన్లు చెల్లాచెదరయి చెట్టుకొకడు, గుట్టకొకడుగా పలాయనం చిత్తగించారు. రణరంగాన్ని ఖాళీ చేసి వెళ్ళారు. ఈ యుద్ధంలో ఒక లక్షా ఇరువయి అయిదు వేల రోమను సైనికులు మరణించారు. మూడు వేల ముస్లిమ్ ముజాహిద్‌లు స్వర్గీయులయ్యారు.

ఈ యుద్ధంలో జరిగిన ఒక సంఘటన ఇది: బ్రతికి ప్రాణాలతో బయటపడ్డ ఒక ముస్లిమ్ యోధుడు తన పిన తండ్రి కొడుకు కోసం వెదికాడు, ఆయనా ఆ యుద్ధంలో పాల్గొనడానికి వచ్చినవాడే. ఎందుకయినా మంచిదని ఆ యోధుడు నీటి చుక్కలేని ఎడారి ప్రాంతం కాబట్టి తోలు సంచిలో నీరు నింపుకుని తన బంధువు కోసం చూస్తూ వచ్చాడు. రణరంగంలో చచ్చిపడిన శవాల మధ్య ఆ యోధుని బంధువు కూడా ఇప్పుడో అప్పుడో ప్రాణం వదిలే పరిస్థితిలో ఉన్నాడు. వెంటనే దగ్గరికి వెళ్ళి చూచాడు. దేహమంతా కత్తిపోట్లతో రక్తసిక్తమయి ఉంది. ఆ సైనికుడు, "నాయనా! కాస్త నీళ్ళయినా త్రాగు" అని సంజ్ఞ చేశాడు. అందుకు మంచిదన్నట్లు కాస్త నోరు తెరిచాడా క్షతగాత్రుడు. నీళ్ళు నోటిలో వెయ్యబోతుండగా అంతలోనే "నీళ్ళు నీళ్ళు" అని మూలగడం విన్నాడు. అతగాడు కూడా ఒక క్షతగాత్రుడే. సైనికుని పినతండ్రి కుమారుడు వెంటనే, "ఆ నీళ్ళు ముందు ఆయనకు ఇవ్వండి" అని అన్నాడు. అలాగే నీటి సంచితో మూలుగుతున్న వ్యక్తి వద్దకు వెళ్ళి చూడగా అతడెవరో కాదు, పేరు పొందిన యుద్ధకిశోరుడు హజ్రత్ సుహైల్(రజి). ఆయనకు నీళ్ళు త్రాగించబోతున్న సమయంలో మరో వ్యక్తి దాహంతో 'నీళ్ళు ఇవ్వండి' అని కోరాడు. హజ్రత్ సుహైల్(రజి), 'ఆ వ్యక్తికి నీళ్ళు ఇవ్వండి' అని సైనికునితో కోరాడు. ఆ మూడో వ్యక్తి కూడా ఎవరో కాదు, హజ్రత్ హారిస్(రజి). ప్రాణాలు వీడుతూ యుద్ధభూమిలో అటు ఇటు పార్లుతున్నారు, సైనికుడు చెంత చేరగానే ప్రాణాలు వీడారు హజ్రత్ హారిస్ (రజి). సైనికుడు

వెంటనే హజ్రత్ సుహైల్(రజి) వద్దకు వచ్చాడు. ఆయన అప్పుడే పరమపదించారు. స్వర్గలోకాన్ని చేరుకున్నారు. వెంటనే సైనికుడు తన బంధువు వద్దకు వచ్చాడు. అప్పుడే ఆ అప్టుడు కూడా అలమటిస్తూ ప్రాణాన్ని వదిలాడు. స్వర్గసోపానాలపై వారంతా ముక్తి ద్వారం చేరుకున్నారు.

చూశారా! ఈ ముగ్గురు త్యాగమూర్తులు చూపిన ఆదర్శం! తమ ప్రాణాలు పోతున్నా తోటి సోదరుల ప్రాణ రక్షణ కోసం తహతహలాడిన ఆ ధన్యజీవులు తమ ప్రాణాలనే కోల్పోయారు. తమ అవసరం కంటే ఇతరుల అవసరమే విశ్వాసులకు ముఖ్యం అని నిరూపించి చూపిన ఈ త్యాగనిరతి చరిత్రలో మరువరానిది.

మోసం దాగుతుందా?

అరబ్బు దేశాన్ని పాలించిన అనేక రాజుల్లో సుల్తాన్ నూరుద్దీన్ ఒకడు. డెమాస్కస్ పట్టణం ఈయన రాజధాని. ప్రశాంతంగా పాలన సాగుతుంటే శత్రువులు సహిస్తారా? ఎందరో శత్రువులు నూరుద్దీన్‌పై విరుచుకుపడ్డారు. ఈయన వారందరికీ తగిన గుణపాఠం చెప్పాడు. పరాభవం పాలయిన శత్రువులు నూరుద్దీన్‌ను కించపరచడానికి ప్రయత్నించారు. వారికి ఒక దుర్బుద్ధి పుట్టింది. మదీనా పట్టణ ప్రశాంత వాతావరణంలో ఉన్న మహాప్రవక్త (స) సమాధిలోని పవిత్ర దేహాన్ని అగౌరవపరచాలనే దురాలోచన వారికి కలిగింది. పరాజితులయిన శత్రువులు జిత్తులు వేయడం సహజమే కదా! అనుకున్న పని ఎలాగయినా నెరవేర్చాలి. సుల్తాన్ నూరుద్దీన్‌ను మానసికంగా దెబ్బతీసి ప్రజలలో గౌరవమర్యాదలు లేకుండా చేయాలన్నదే వారి కోరిక.

మొరాకోలో కుట్ర జరిగింది. ఈ దుష్ట కార్యానికి ఇద్దరు వ్యక్తులు ఎన్నుకోబడ్డారు. 'హజ్' యాత్రకు మొరాకో నుండి వస్తున్న ప్రజలతో వీరిరువురు కలిసి మదీనా వచ్చారు. చేయదలచిన పని సులభమయినది కాదు. ముస్లిమ్‌ల మధ్య నివసిస్తూ వారు భరించరాని ఈ పని చేయడం ఎలా సాధ్యమవుతుంది?

దుష్టులిరువురూ మదీనా పట్టణంలో నివాసమేర్పరచుకున్నారు. మహాప్రవక్త (స) సమాధికి పడమటి భాగంలో ఉన్న ఒక పాత ఇంటిలో మకాం చేశారు. వారిరువురి జీవితం చూస్తే దైవదూతలకు సరితూగేలా అగుపడుతోంది. ధార్మిక రూపం, వేషం, ప్రవర్తన అంతా అక్కడున్న ప్రజల్ని ఆకర్షించింది. దైవప్రవక్త (స) సన్నిధిలో నివసించే అర్హత వీరిద్దరికే ఉన్నట్టు ప్రజలు అభిప్రాయపడ్డారు. అంతటితో ఒక ఘట్టం పూర్తయ్యింది. నమ్మకం సంపాదించుకున్న ఆ అవిశ్వాసులు అనుకున్న పనిని ప్రారంభించేందుకు పూనుకున్నారు.

తామున్న ఇంటిలో ఒక సొరంగం చేయ మొదలుపెట్టారు. త్రవ్వకంలో వచ్చిన మట్టిని దగ్గరే ఉన్న గోయిలో పడేస్తూ వచ్చారు. పగలంతా ధార్మిక వేషం రాత్రంతా ఈ కపట నాటకం సాగిస్తూ వచ్చారు! కొన్ని దినాలు ఇలా గడిచాయి. దాదాపు మహాప్రవక్త (స) శాశ్వతంగా నివసించే స్థలం శాంతి నిలయం. ప్రళయం వరకు ప్రజలకు ఆదర్శవంతం ఆయన జీవితం. అలాంటి పవిత్ర మనిషి దేహాన్ని పరాభవపరచడం మానవ సాధ్యమా? మహాప్రవక్త (స) సుల్తాన్ నూరుద్దీన్‌కు కలలో కనిపించారు. ఆ కలలో మహాప్రవక్త (స) ఇరువురు వ్యక్తుల్ని ఆ రాజుకు చూపించారు. వరుసగా మూడు రోజులు ఇదే కలకన్న సుల్తాన్ గాభరాపడ్డాడు. నూరుద్దీన్ నిజమయిన విశ్వాసి. మహాప్రవక్త (స) దర్శనమిచ్చి తనకు ఏదో కర్తవ్యం బోధించారని ఆయనకు సమ్మకం కలిగింది. ఆలోచించాడు. ఏదో విపరీతమయిన విషయముందని గ్రహించాడు. మహాప్రవక్త (స) ఆత్మశాంతికి భంగం కల్గించే కల్లోలం ఏమిటా అని విచారించడానికి మదీనా పట్టణం చేరాడు. తన వెంట ఎంతో ధనం కూడా తీసుకువెళ్ళాడు.

సుల్తాన్ మదీనా పట్టణంలో మకాం వేశాడు. దానధర్మాల కార్యక్రమం మొదలుపెట్టాడు. ప్రజలందరికీ తన చేతుల మీదుగా ధారాళంగా బహుమానాలు ఇస్తూ వచ్చాడు. ఎందుకూ? స్వప్నంలో మహాప్రవక్త (స) సంజ్ఞ చేసి చూపిన ఆ ఇద్దర్ని గుర్తించడానికి! కాని ఆ అపర ధర్మపరాయణులు మాత్రం రాజు ఎదుటకు

రాలేదు. "ప్రజలంతా వచ్చారా? బహుమానాలు అందరికీ అందాయా?" అని రాజు ఆసక్తితో దర్యాప్తు చేశాడు. "అయ్యా ప్రజలంతా వచ్చి, మీరు అనుగ్రహించిన బహుమానాలు తీసుకున్నారు. కాని ఇద్దరు వ్యక్తులు మాత్రం రాలేదు ప్రభూ! వారిద్దరు దైవధ్యానపరాయణులు. నిరంతరం దైవస్తుతిలో నిమగ్నమయి ఉంటారు. ప్రాపంచిక వ్యవహారాలంటే అసలు కన్నెత్తి చూడరు. నలుగురిలో కలిసి ఉండటం కూడా వారికి ఇష్టం లేదు" అని రాజభటులు సుల్తాన్‌కు విన్నవించారు. వారిద్దర్ని వెంటనే రప్పించాడు సుల్తాన్. వారిని గుర్తుపట్టాడు. కలలో ప్రవక్త (స) చూపిన ఇద్దరు వ్యక్తులు వీరే. సుల్తాన్ వారి నివాస స్థలానికి వెళ్ళాడు. ఇల్లంతా పరిశీలించాడు. ఉద్గ్రంథ ప్రతులెన్నో అక్కడ జాగ్రత్తగా ఉన్నాయి. ఎక్కడ చూచినా ధార్మికత ఉట్టిపడే చిహ్నాలు గోచరిస్తున్నాయి. వారిద్దరు అమిత ధర్మపరాయణులని వారికి సంబంధించిన ప్రతి వస్తువూ తెలుపుతూంది. మట్టి నేల, ఆ నేలపై సన్యాస జీవితానికి దర్పణంలా ముతక చాప. సుల్తాన్ మాత్రం కృతనిశ్చయంతో అంతా పరిశీలిస్తున్నాడు. చాపనెత్తి చూశాడు. ఏముంది? దాగి ఉన్న కుట్ర బయటపడింది. సొరంగం విషయం దర్యాప్తు చేశాడు సుల్తాన్. పన్నాగం ఒప్పుకోక తప్పింది కాదు ఆ దోషులకు. "ఓ సుల్తాన్! ఇంకా కొన్ని దినాలు గడిచివుంటే మేము ముస్లిముల కన్నులుగప్పి మీ ప్రవక్త దేహం వరకు చేరి దానిని అగౌరవపరచి ఉండేవారము. ఆ దరిదాపులకు చేరే సమయంలో దట్టని మేఘాలు ఆకాశం అంతా అలుముకున్నాయి. పిడుగులు మాపై వచ్చి పడినట్లయింది. మేము ఆగిపోయాం. ఇంతలోనే మీరు రావడం, ఇదంతా జరగడం సంభవించింది. మా దురదృష్టం" అన్నారు ఆ మూర్ఖులు.

వంచకుల కథను వింటున్న సుల్తాన్‌కు కన్నీళ్ళ పర్యంతమయింది. ఆయన కోపోద్రేకాలతో ఊగిపోయాడు. కత్తితో కపట సన్యాసుల కంఠాలు నరికాడు. క్షణంలో నేలకూలారు. సుల్తాన్ అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఇక మీదట అలాంటి అఘాయిత్యానికి ఎవరూ పాల్పడకుండా మహాప్రవక్త (స) సమాధి చుట్టూ కందకం త్రవ్వించి సీసపు గోడను కట్టించాడు నూరుద్దీన్.

పుణ్యకార్యాలలో పోటీ

దైవంపై విశ్వాసం కలవారు తోటి మానవుల్ని ప్రేమిస్తారు- వారికి సహాయం అందించడానికి అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉంటారు. మహాప్రవక్త (స) స్థాపించిన ఆదర్శ సమాజంలో సమాజ శ్రేయోభిలాషుల కొరత ఉండేది కాదు. ఖలీఫా మొదలుకుని సామాన్య మానవుని వరకు పుణ్యకార్యాలు చేయడంలో ఒకరినొకరు పోటీ పడేవారు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) తరువాత హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) ఖలీఫా అయ్యారు. మదీనాలో ఉండేవారు. మదీనా పట్టణానికి సమీపంలో ఒక కళ్ళు కానరాని కబోది ఓ పూరిగుడిసెలో ఒంటరిగా నివసించేది. ఎవరూ ఆమెకు తోడునీడగా లేరు, కాళ్ళు చేతుల్లో బలం కూడా పూర్తిగా పోయింది. కాస్త చేతి కర్ర ఆసరాతో నిలబడే స్తోమత కలిగివుండేది. పాపం ఆమెకు సంతానం కూడా లేదు.

ఒకనాడు హజ్రత్ ఉమర్ (రజి) దృష్టి ఆ వృద్ధురాలిపై పడింది. ఆమె నివసించే తీరు, ఆమె నిస్సహాయత అన్నీ విచారించి తెలుసుకున్నారు ఉమర్ (రజి). ఇలాంటి తరుణం వదులుకుంటారా? హజ్రత్ ఉమర్ (రజి) ముసలావిడ స్థితిని తెలుసుకున్న వెంటనే చెయ్యవలసిన కర్తవ్యం ఏమిటో ఆలోచించుకున్నారు. రోజూ ఉదయం ముసలమ్మ ఇంటికెళ్ళి కసువు ఊడ్చి, నీళ్ళు తెచ్చి ఏదయినా అవసరమయితే వెంటనే బజారుకు వెళ్ళి అది తెచ్చి పెట్టేవారు. ఆ వృద్ధురాలి అవసరాలు తీర్చడమే కాకుండా ఆమెకు ఎలాంటి బాధ కూడా కలక్కుండా అన్ని ఏర్పాట్లు చేసేవారు. ఈ విధంగా కొన్నాళ్ళు గడిచాయి. వృద్ధురాలు కూడా సుఖంగా కాలక్షేపం చేస్తూ వచ్చింది. కాని ఆమె, తన అవసరాలను తీర్చే మహానుభావుడెవరో తెలుసుకోలేకపోయింది. హజ్రత్ ఉమర్ (రజి) కూడా కేవలం దైవ ప్రీతి కోసం ఆ సేవ చేసేవారు, ప్రజల మెప్పు కోసం కాదు. అందుచేతనే తెల్లవారక మునుపే వృద్ధురాలి ఇంటికెళ్ళి కావలసిన పనులన్నీ ఎవరి కంటాబడకుండా చేసేవారు.

కొన్ని దినాలు గడిచాయి. ఒకసారి ఆయనకంటే ముందు మరో వ్యక్తి ఎవరో వచ్చి వృద్ధురాలి సేవ చేస్తూ పనంతా పూర్తి చేసుకుని వెళ్ళిపోవడం జరిగింది. హజ్రత్ ఉమర్(రజి)కు ఆశ్చర్యం కలిగింది. తనకంటే ముందు వచ్చి ఈ సేవ చేసి వెళ్ళిపోతున్నదెవరు? అని ఆలోచించారు. పాపం ముసలావిడ గ్రుడ్డిది. ఎవరు వచ్చిపోయేది ఆమెకు తెలియదు. ఆమెకు కావలసిందల్లా తన పని పూర్తికావడం. పైగా ఈ పనంతా చాలా రాత్రి ఉండగానే జరగటం వల్ల ఆమె ఇంకా నిద్ర నుండి మేల్కొనేది కాదు. ఎవరు వస్తున్నారో తెలిసేది కాదు.

ఒక రాత్రి హజ్రత్ ఉమర్ (రజి) తనకంటే ముందు వచ్చే ఆ సేవాపరాయణు డెవరో చూడాలనుకున్నారు. రాత్రే వచ్చి వాకిలి వెనుక దాగి నిలబడ్డారు. తెల్లవారేందుకు ఇంకా చాలా సమయముందనగా ఒక వ్యక్తి మెల్లమెల్లగా వచ్చాడు. ఇంటిలోని పనంతా ప్రశాంతంగా చేశాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఆయన ఎవరో గుర్తించాలని ఎంతగా ప్రయత్నించినా చీకటి ఉన్నందున గుర్తుపట్టటానికి వీలులేకపోయింది. వచ్చిన వ్యక్తి పనంతా ముగించి వెళ్ళిపోతూ వాకిలి దగ్గరగా వచ్చాడు. హజ్రత్ ఉమర్ (రజి) దిగ్భ్రాంతితో ఆయనను చూశారు. ఆయన ఎవరో కాదు, ప్రజాపాలకుడయిన ఖలీఫా, విశ్వాసుల నాయకుడు, హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి). హజ్రత్ ఉమర్ (రజి) ఓ దీర్ఘమయిన నిట్టూర్పు వదిలారు.

ఇదే విధంగా మరో సంఘటన కూడా జరిగింది. అది తబూక్ యుద్ధ సమయం. విశ్వాసులు ఎంతో లేమిననుభవిస్తున్నారు. ఆర్థికంగా అది గడ్డు కాలం. అలాంటి సమయంలో రోమన్లతో యుద్ధం చేయవలసివచ్చింది. మహాప్రవక్త ముహమ్మద్ (స) యుద్ధ విరాళాల కోసం అప్పీలు చేశారు. హజ్రత్ ఉమర్ (రజి) వద్ద డబ్బు ఉంది. "హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) కంటే ఎక్కువగా నేను విరాళాలివ్వాలి. ఈసారి సత్కార్యంలో ఆయన్ని మించిపోవాలి" అనే ఆలోచన ఆయనకు కలిగింది. ఈ ఆలోచన రాగానే ఉల్లాసంగా ఇంటికి వెళ్ళారు. తన

ఇంటిలోవున్న ఆస్తిలో సగభాగం సంతోషంగా తెచ్చి విరాళంగా మహాప్రవక్త (స) ముందు సమర్పించుకున్నారు. కారుణ్యమూర్తి (స) అది చూచి "ఉమర్ నీ ధనంపై ఇంటి వారికి కూడా హక్కుంది కదా! సతీమణి, సంతానం కోసం ఏమయినా వదలివచ్చావా?" అని అడిగారు. "ప్రవక్తా! సగభాగం భార్యాపిల్లల కోసం వదలి వచ్చాను. మిగిలిన సగభాగం దైవధర్మ సంస్థాపనార్థం సమర్పించుకున్నాను" అని ఉమర్ (రజి) అన్నారు.

ఇంతలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) ఇంటిలోనున్న సమస్త సిరిసంపదల్ని తెచ్చి మహాప్రవక్త (స) సమక్షంలో సమర్పించారు. "ఏమయ్యా అబూబకర్! ఇంటివారికి కూడా ఏదయినా వదలివచ్చావా? లేదా?" అని అన్నారు మహాప్రవక్త (స).

"వారికై అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తే (స) చాలు" అని జవాబిచ్చారు అబూబకర్(రజి). ఆ సమయంలో ఉమర్ ఫారూఖ్ (రజి)అక్కడే ఉన్నారు. త్యాగనిరతిలో తనను మించిన హజ్రత్ అబూబకర్(రజి)ని చూచి ఒక్కసారిగా ఇలా అన్నారు, "నేను ఏ పుణ్యకార్యంలోనూ హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి)ని మించిపోలేను."

"....ప్రాణత్యాగమే నయం"

హజ్రత్ ఉస్మాన్(రజి) ఖలీఫాగా రాజ్యపాలన చేస్తున్నారు. అవి ఆయన పాలనలో చివరి రోజులు. హజ్రత్ ఉస్మాన్(రజి) వ్యక్తిగత వ్యవహారాల పట్ల కొంత మందికి అయిష్టం కలిగింది. పెద్ద పెద్ద పట్టణాలలో నివసించే కొంత మంది దురహంకారులు కుట్రలు పన్నడం ప్రారంభించారు, హజ్రత్ ఉస్మాన్ (రజి)ని పొట్టనపెట్టుకోదలిచారు. బస్రా, కూఫా, మిస్ర్ (ఈజిప్ట్) పట్టణాల నుండి కొందరు కల్లోలాన్ని రేకెత్తించడానికి, సమాజంలో అరాచక పరిస్థితులు సృష్టించడానికి,

పౌరుల మధ్య భేదాభిప్రాయాలు కల్పించడానికి కక్షలకు, కార్పణ్యాలకు మార్గం సుగమం చేసి అంతర్గత పోరాటానికి అనువయిన వాతావరణం సృజించడానికి పూనుకున్నారు. విద్రోహకారులు ఖలీఫా ఇంటిని చుట్టుముట్టారు. ఆయన(రజి) బయటకు రాగానే ప్రాణాలు తీసి ఆయన్ని(రజి) అమరగతులు చేయడానికి విద్రోహులు పొంచివున్నారు.

ఖలీఫా దైవభయం కలవారు. ప్రజలకు సంతృప్తి కలిగేలా సమాధానపరచడానికి ప్రయత్నించారు. తనపై మోపిన ఆరోపణలకు తగిన సంజాయిషీ ఇచ్చారు. కాని మతి కోల్పోయిన దుష్టులకు హితోపదేశం మనసుకెక్కుతుందా? వేసిన ప్లాను వదులుకోవడానికి ఇష్టపడలేదు. దౌర్జన్యానికే దిగారు. ప్రజానాయకుని హత్యకు వ్యూహం పన్నారు. ఇంటి చుట్టూ చేరి ఇంటిపై రాళ్ళు రువ్వడం ప్రారంభించారు. హజ్రత్ ఉస్మాన్(రజి) రాళ్ళ వర్షానికి తాళలేక ఒక మూల గదిలో చేరారు.

ఇలా ఇంటిలో బంధించబడ్డాక హజ్రత్ ఉస్మాన్ (రజి) వరుసగా ఉపవాసాలు పాటించసాగారు. సాయంత్రం ఉపవాస విరమణకు ఆహారం ఉండేది కాదు. చివరకు గ్రుక్కెడు నీళ్ళు కూడా లభించేవి కాదు. రాత్రి అలాగే పస్తులతో గడిపేవారు. మళ్ళీ మరుసటి దినం ఉపవాసవ్రతం పాటించేవారు. బయటి నుండి రాళ్ళు వచ్చిపడుతున్నాయి. ఒక్క గదిలో బంధితుడయి ఉన్నాడు ఖలీఫా. తిండి, నీళ్ళు కూడా కరువయ్యాయి. వయస్సు చూస్తే వృద్ధాప్యం. నిరంతరం ఉపవాసాలతో దైవ ప్రార్థనలు చేస్తూ కాలం గడుపుతున్నారు ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి). వేసవి మండుటెండల్లో ఆ వయోవృద్ధుని స్థితి ఎలా ఉంటుందో మీరే ఆలోచించండి.

హజ్రత్ ఉస్మాన్ (రజి)ను సమర్థించేవారి సంఖ్య కూడా చిన్నదేమీ కాదు. మహాప్రవక్త(స)తో ఆయనకు బంధుత్వం ఉంది. బీదసాదలకు సహాయం చెయ్యడంలో ఆయనను మించిన దాతృగుణం కలవారు మరెవరూ లేరు. అనాథలకు ఆశ్రయమిచ్చేవారు. ఖలీఫా పదవి నలంకరించకముందు ప్రజాసంక్షేమ కార్యక్రమాలతోనే కాలం గడిపిన మహా వ్యక్తి హజ్రత్ ఉస్మాన్(రజి). అలాంటి వ్యక్తి

ఇప్పుడు ఖలీఫాగా ఉన్నారు. ఒక్కమారు సంజ్ఞ చేస్తే చాలు, లక్షలాది ప్రజలు దుష్టుల ఆటకట్టించి వారిని నామరూపాల్లేకుండా చేసివేయగలరు. కొంత మంది ఖలీఫాతో సంప్రతించారు. ద్రోహులకు గుణపాఠం నేర్పాలన్నారు. మెరిసే ఖడ్గాలతో వారిని నిలువునా చీల్చి కాకులకు వేయాలన్నారు. కాని ఖలీఫా అందుకు ఇష్టపడలేదు. వ్యక్తిగతంగా నాపై వారికి పగ ఉంది. కక్ష సాధించుకునేందుకు వారు నాపై పడ్డారు. అందుచేత నిష్కారణంగా సిపాయిలను పంపి, సైనిక చర్యకు పూనుకోవడం తగదని నిర్ణయించారు. యుద్ధానికి నడుము బిగించి నిలిచి ఉన్న ఐదు వందల సిపాయిలను అదుపులో పెట్టారు. విద్రోహశక్తులతో యుద్ధం చేయడానికి అనుమతించమని ఎంతగా కోరినా ఖలీఫా మాత్రం తన నిశ్చయాన్ని మార్చుకోలేదు. తన దగ్గరున్న నౌకరులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రకటించారు.

"మీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళండి. కాని ముస్లిమ్‌లతో పోరాటం చెయ్యకండి" అని వారందరిని సాగనంపారు ఖలీఫా. ఈ సమయంలో హజ్రత్ ముగైరా ఖలీఫా దగ్గరికి వచ్చారు. విద్రోహశక్తులు చేస్తున్న కార్యకలాపాలపై తన ఆగ్రహాన్ని వెలిబుచ్చారు.

"ఖలీఫా! రండి, బయటికి వచ్చి, విద్రోహశక్తుల్ని అణచివేయండి. లేకుంటే ఇంటి గోడకు కన్నం వేసి మక్కా పట్టణం చేరుకోండి. ఆ పట్టణం శాంతికి నిలయం. మీ ప్రాణానికి రక్షణ కలుగుతుంది. అదీ చెయ్యకపోతే సిరియా చేరుకోండి" అని అన్నారు. కాని ఖలీఫా దూరదృష్టి కలవారు. "నేను యుద్ధమయితే చెయ్యను, మహాప్రవక్త ముహమ్మద్ (స) అడుగుజాడల్లో నడవడమే నా కర్తవ్యం. ముస్లిముల మధ్య వైషమ్యాలు సృష్టించి, వారి మధ్య అఖాతాన్ని పెంచలేను. వారి రక్తాన్ని చిందించదలచలేదు. మక్కా పట్టణం కూడా వెళ్ళదలచుకోలేదు. ఎందుకంటే ఆ పుణ్యస్థలాన్ని కూడా ఈ మూర్ఖులు తమ కార్యకలాపాలకు నిలయంగా మార్చి అపవిత్రం చేస్తారు. ఇక సిరియా వెళ్ళడమా! మహాప్రవక్త ముహమ్మద్ (స) అసువులు బాసిన అసలు ప్రదేశం వదలి ఎక్కడికయినా వెళ్ళడానికి నా మనసు

అంగీకరించటం లేదు" అని అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి). ఆయన హత్య కోసం విద్రోహులు వేచియున్నారని తెలిసిన వెంటనే హజ్రత్ అలి (రజి) తన ఇరువురు కుమారులతో మరికొంతమంది విశ్వాసులతో కలిసి హజ్రత్ ఉస్మాన్ (రజి) ఇంటి చుట్టూ పహరా కాశారు. కాని విద్రోహ చర్యలకు ఆటంకాలుంటాయా? తలపెట్టిన కార్యాన్ని నిర్వహించేందుకు మరో మార్గంగుండా ఇంటిలో ప్రవేశించి హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖుర్‌ఆన్ పఠనం చేస్తున్న సమయంలో ఆయన్ను వధించారు శత్రువులు. ఖలీఫా అమరగతులయ్యారు.

విద్యా సముపార్జన

విద్యను మించిన విత్తము ప్రపంచంలో లేదంటారు పెద్దలు. అలాగే విద్యరానివాడంతటి దౌర్భాగ్యుడు కూడా ప్రపంచంలో మరొకడుండడు. విద్య వల్లనే మనిషికి విజ్ఞానం లభిస్తోంది. విజ్ఞానం వల్ల జీవితం వివేకవంతమవుతుంది. దైవం పట్ల విశ్వాసం దృఢతరమవుతుంది. విద్యరానివాడు వింత పశువు కావడమే కాకుండా, ధర్మజ్ఞానానికి దూరమవుతాడు. త్రికరణశుద్ధిగా, ఏ ఆచరణనూ చెయ్యలేడు. విద్యా మహాభాగ్యాన్ని పొందే కృషి చెయ్యడం ప్రతి ముస్లిమ్ స్త్రీ పురుషులకు విధిగా నిర్ణయించబడింది. ఎవరయితే తమ విశ్వాసాన్ని పటిష్ఠపరుచుకో దలుస్తారో, ఆచరణలో ఆదర్శవంతులుగా ఉండదలుస్తారో వారు వేయిపాట్లు పడి అయినా సరే విద్యార్జనకై ముందడుగు వేస్తారు.

ఇస్లామీయ విద్యనభ్యసించడంలో ఎందరో మహానుభావులు మనకు ఆదర్శప్రాయులయ్యారు. అందులో 'ఇమామ్ బుఖారీ' ఒకరు. ఆయనంటే తెలియని ముస్లిమ్ ప్రపంచంలోనే లేరు. విద్యనభ్యసించటానికి ఎన్నో కష్టాల్ని ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆప్తుల్ని వదలి, దూరదూర ప్రాంతాలకు ప్రయాణం చేశారు. పధ్నాలుగేండ్ల ప్రాయంలో ఇంటిని వదలి బుఖారా పట్టణం నుండి ఈజిప్ట్

వరకు దేశదేశాల పర్యటన చేస్తూ, లభించిన విద్యనంతా ఆకళింపు చేసుకున్నారు. మీరే ఆలోచించి చూడండి! బుఖార ఎక్కడుంది? ఈజిప్ట్ దానికెంత దూరంలో ఉంది, రహదారులుకాని, వాహనాలుకాని లేని రోజుల్లో ఇమామ్ బుఖారీ అంతటి దూర ప్రయాణం ఎలా చేశారో! కాని ఇమామ్ బుఖారీ సహనం కలవారు. ఆత్మ విశ్వాసం కలవారు. ఆదర్శ విద్యార్థిగా నిలిచారు. తినడానికి తిండిలేకపోయినా ఎన్నో దినాల వరకు అరణ్యాలలో నిర్భయంగా ఆకులు, అలములు తింటూ, తన ధ్యేయసాధనలో వీటన్నింటినీ లెక్కచెయ్యకుండా తిరిగారు. ఆయనలోని ఉత్సాహం, కార్యదీక్ష అల్లాహ్‌కు నచ్చింది. సకల విద్యాపారంగతునిగా అల్లాహ్ ఆయన్ని అనుగ్రహించాడు. అన్ని విధాల ఆదరించాడు. అందుచేతనే హదీసు విద్యయందు ఆయన ప్రపంచంలోని పండితులందరికీ అగ్రగామిగా, ఆది పురుషుడుగా నిలిచారు.

గురు శిష్య సంబంధం

శిష్యులంటేనే గొప్ప అపోహ, "ఏండ్ల తరబడి గురువు దగ్గర సేవ చేస్తూ చదువుకొనేవారు" అని. అలాగే గురువంటే శిష్యులపై ఆధిపత్యం చెలాయిస్తూ, వారికి ఉపదేశాలు చేస్తూ వారి సేవల్ని అందుకొనేవాడు అని కూడా అందరూ అనుకుంటుంటారు. వాస్తవంగా గురువు తండ్రితో సమానుడు. గురువు చేసే మేలు విద్యార్థులు మరువరానిది. అల్లారుముద్దుగా పెంచి పోషించే తల్లిదండ్రుల్ని తనయులు ఎలా మరువకుండా వారిని గౌరవిస్తుంటారో అదే విధంగా విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో సంస్కారవంతులయిన మనుషులుగా తమను తీర్చిదిద్దినందులకు విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల వినయ విధేయతలు కలిగి ఉంటారు. ఆ కారణంగా వారికి సేవలు చేసేందుకు కూడా ఎప్పుడూ సంసిద్ధులయి ఉంటారు.

కాని గురువులు శిష్యులచే సేవలు చేయించుకుంటూ ఉండాలని దీనికి అర్థం కాదు. విద్యాబుద్ధులు చెప్పేది విద్యార్థుల నుండి ప్రతిఫలాన్ని ఆశించి కాదు.

అలా చేస్తే విద్య ఒక వ్యాపారంగా మారుతుంది; దాని విలువను అది కోల్పోతుంది. గురుశిష్యుల మధ్య ఉండాల్సిన సంబంధాలు కూడా దెబ్బతింటాయి. విద్యార్థులు గురువుల పట్ల గౌరవమర్యాదలు చూపటం మానేస్తారు. విద్యార్థుల జీవితంలో గురువుల ఆదర్శం అట్టే ప్రభావం చూపదు. ప్రపంచంలో ఆదర్శవంతులయిన పుణ్య పురుషులు, సన్మార్గ దర్శకులు, విద్యాబుద్ధులు నేర్పిన మహనీయులు ఎందరో ఉన్నారు. గురుశిష్యుల సంబంధానికి ఆదర్శాలు నెలకొలిపారు. అలాంటి మహానుభావులకు సంబంధించిన రెండు చిన్న సంఘటనల్ని తెలుసుకుందాం రండి:

మియా అబ్దుల్లా బదాయూని అనే ఒక గురువుగారుండే వారు. ఆయన విద్యారంగంలో సాధించిన ఫలితాలు మరువరానివి. ఎంతో ఆప్యాయంగా శిష్యుల్ని దగ్గరకు చేర్చి పలు విద్యలు నేర్పేవారు. విద్యాగరిష్టుల్ని చేసేవారు. ఇంటి పనులన్నీ తానే స్వయంగా చేసుకునేవారు. బజారుకెళ్ళి సరకులు కొని తెచ్చేవారు. అలాంటప్పుడు కూడా విద్యార్థుల్ని వెంటబెట్టుకొని సమయం వృథా చెయ్యకుండా పాఠాలు చెప్పేవారు. విద్యార్థులు కూడా వెంట వచ్చేవారు. గురువు చెప్పేదంతా శ్రద్ధాసక్తులతో వినేవారు, వినయ విధేయతలతో మెలిగేవారు. వెళ్తూ వెళ్తూ "అయ్యా, ఈ వస్తువుల్ని మీరు మోయడమెందుకు, మాకివ్వండి, ఆ మాత్రపు అవకాశమయినా మాకివ్వండి" అని ప్రాధేయపడేవారు. కాని గురువులకే ఆదర్శమూర్తి అయిన మియా అబ్దుల్లా బదాయూని అలాంటి విజ్ఞప్తులను చిరునవ్వుతో మృదువుగా త్రోసిపుచ్చేవారు. వీపు మీద సామానుల మూట స్వయంగా మోసుకొని వస్తారేకాని విద్యార్థులతో లేశమంత పనయినా తీసుకునేవారు కారు.

మరో సంఘటన: మౌలానా ఖారి అబ్దుర్రహ్మాన్ ముహద్దిస్ (హదీసు విద్యలో ప్రవీణులు) పానిపతి (రహ్మలై) ఇలాంటి వర్గానికి చెందిన ఇంకొక ఆదర్శ గురువు. ఆత్మగౌరవం ఆయనకు పుట్టుకతో వచ్చిన గుణం. విద్యాబోధన చేయడం ఆయన స్వాభావిక లక్షణం. పేరు ప్రఖ్యాతులు పొందిన మౌలానా హాలి ఈయన

శిష్యగణంలో ఒకరు. ఒక పర్యాయం గురువు అబ్దుర్రహ్మాన్‌గారు ఒక ఉత్తరాన్ని వ్రాశారు. తన దగ్గర ఉద్యోగం చేస్తున్న నౌకరు కనబడితే ఆ ఉత్తరాన్ని పోస్టు బాక్సులో వేయిద్దామనుకున్నారు. ఈ విషయాన్ని ఒక విద్యార్థి అట్టే గ్రహించగలిగాడు, గురువు నౌకరు కోసం ఎదురుచూస్తున్నారని కనుక్కున్నాడు. వెంటనే సవినయంగా ముందుకు వచ్చి, "గురువర్యా! ఉత్తరాన్ని ఇలా ఇవ్వండి, నేనే పోస్టు చేసి వస్తానన్నాడు!" ఎంత వద్దన్నా ఆ శిష్యుడు మాత్రం పదే పదే ప్రాధేయపడ్డాడు. అది విని, "నేనీ పని నీతో చేయించదలచలేదు. ఎందుచేతనంటే నీకూ నాకూ మధ్య ఉన్న సంబంధం విద్యాసంబంధం. ఉత్తరాన్ని పోస్టు చేసే శ్రమ తీసుకోవడం నీ హక్కు అని నీవు ఈ పని నెరవేరుస్తావు. కాని నా దృష్టిలో ఇలా పని చేయించుకోవడం లంచం తీసుకోవడంతో సమానం! పైపెచ్చు విద్యాభ్యాసంలో మన మధ్య ఉండవలసిన ప్రేమాదరణలు కూడా దూరమవుతాయి. చిన్న పని అని తలచి ఈ పని చేయించుకుంటే నాకు లభించే పుణ్యఫలం ఏంగాను?" అని అన్నాడా పండితుడు.

-: సమాప్తం :-